vaarthapatrika.com

# వార్తపత్రిక

జాతీయ తెలుగు దినపత్రిక

vaarthapatrika.com / epaper.vaarthapatrika.com

TS-02-0297488

విలేకరులు కావలెను

వార్తపత్రిక


తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న వార్తపత్రిక దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490617567- 87903 15659

ఎడిటర్ : మరే చిన్నబాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 66 సోమవారం , ఏప్రిల్ 06, 2026 , పేజీలు -08 వెల : 2 /-

## విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

**- అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ**



**గౌహతీ ఏప్రిల్ 05:** ప్రజల మధ్యన విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ విద్వేషం వ్యాప్తి చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అసోంలోని బిశ్వనాథ్ చరియాలీలో ఆదివారం నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విద్వేషం విరజిమ్మే నేతగా ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే.. హిమంత క్షమాపణలు కోరినా.. వదిలిపెట్టబోమని, చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మిగతా2లో...


## ఎల్పీజీ కష్టాలు

- కిలో రూ.500కి చేరిక
- భారంగా 'ఛోటా' సిలిండర్
- పేదలు, వలస కార్మికులకు తప్పని తిప్పలు
- బ్లాక్ మార్కెట్ దందాను కట్టడి చేయలేని ప్రభుత్వాలు




## అమెరికాకు మరో ఎదురు దెబ్బ

- రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి
- దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం
- పట్టించుకోని టెహ్రాన్
- గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు



**ఇరాన్, ఏప్రిల్ 05:** ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని మిగతా2లో...

## నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు

# దిక్సూచి

● బుద్వేలులో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన ● కార్యనిర్వాహక వ్యవస్థతో కలిసి పనిచేయాలి ● అప్పుడే రాజ్యాంగం సజీవం: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 05:** రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ లక్ష్యాల విషయంలో ఏకీభవించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలనేవి ఐచ్ఛికం కాదనీ, అత్యవసరమేననీ, వాటిని బలోపేతం చేయటం తప్పనిసరి అని అన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని బుద్వేల్‌లో రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి జస్టిస్ సూర్యాకాంత్ మిగతా2లో...




## భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

**ఆరు శాతానికి తగ్గింపు : మూడీస్ నివేదిక**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:** మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్‌పీజీ రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్‌పీజీ కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది."పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన మిగతా2లో...

## నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

- 373 ఎకరాల భూమిని తన్నుకుపోతున్న కాంగ్రెస్ పెద్దలు
- కబ్జా కంపెనీల వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం
- అధికార పార్టీ నేతల ఆక్రమణలు హైడ్రాకు కనిపించడం లేదా?
- ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో అక్కడికి వెళ్తాం : మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక




## జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

**- ఏపీ మంత్రుల తీవ్ర విమర్శలు**



**అమరావతి, ఏప్రిల్ 05:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోందని పార్థసారథి వ్యాఖ్యానించారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు మిగతా2లో...


## నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**కమలనాథులు చురుగ్గా పాల్గొనాలి**

**ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడాలి: పార్టీ చీఫ్ రాంచందర్ రావు పిలుపు**



**హైదరాబాద్ ఏప్రిల్ 05:** బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమ వారం (6న) పార్టీ శ్రేణులు పార్టీ నిర్దేశిం చిన వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, ఇంటి యజమాని అనుమతితో వారి ఇంటిపై పార్టీ జెండా ఎగుర వేయాలని ఆయన సూచించారు. దీంతో జాతీయ గౌరవ భావన, ప్రజా భాగస్వామ్యం, పార్టీ పట్ల ప్రజల ఆత్మీయ అనుబంధం మరింత బలపడుతోంది. అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమానికి ఎంతో సానుకూల స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.దేశవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు ఘనంగా జరుపుకోనున్నారని ఆయన చెప్పారు. వేడుకలకు ముందు రోజే ప్రతి బూత్‌లో, ప్రతి ప్రాంతంలో పార్టీ కార్యకర్తలు ఇప్పటికే పార్టీ జెండాను ఆవిష్కరించడం ప్రారంభించి, పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి మిగతా2లో...




## తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

**ఎఐ, లైఫ్‌సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ తదితర రంగాల సమ్మేళనంతోనే వృద్ధి సాధ్యం విదేశాల్లోని మన విద్యార్థులు, నిపుణులు భారత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి కొలంబియా బిజినెస్ స్కూల్ 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్'లో కెటిఆర్ ప్రసంగం**

**హైదరాబాద్ ఏప్రిల్ 05:** స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభివర్ణించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను మిగతా2లో...

## ఆప్ నేతలకు రాఘవ చద్దా కౌంటర్

**- సినిమా ఇంకా ఉందని వీడియోలతో ఎదురుదాడి**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:** పంజాబ్ వేదికగా ఆమ్ ఆద్మీపార్టీలో సంక్షోభం ముదిరింది. ఆప్ రాజ్యసభ సభ్యులు ఎంపి రాఘవ చద్దా ఆదివారం పార్టీ నాయకత్వంపై ఎదురుదాడికి దిగారు. సినిమా అయిపోలేదు. ఇంకా మిగిలే ఉంది. పైగా ఇప్పుడే అసలు సినిమా అంటూ వీడియోలు విడుదల చేశారు. పార్లమెంట్‌లో పంజాబ్ సమస్యలను రాఘవ ప్రస్తావించడం లేదనే పార్టీ అంతర్గత వాదనను మిగతా2లో...

# ఎల్పీజీ కష్టాలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 05:** మధ్యప్రాచ్య యుద్ధం వల్ల ఎల్పీజీ సరఫరా తీవ్రంగా ప్రభావితమైంది. 14.2 కిలోల గృహ సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో రూ.3000 వరకు అమ్ముడవుతోంది. అధికార ధర మాత్రం రూ.914 మాత్రమే. 5 కిలోల సిలిండర్ రీఫిల్ ధర కిలోకు రూ.400–500కు పెరిగింది. ఈ పరిస్థితిలో చిన్న సిలిండర్ ధర పెద్దదాని కంటే ఎక్కువైంది. అందుకే 'ఛోటా' సిలిండర్ ఇప్పుడు 'పెద్దది'గా మారిందని భావిస్తున్నారు. వలసకార్మికులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ఈ ఐదు కిలోల సిలిండర్‌పై ఆధార పడుతుంటారు. కానీ ప్రస్తుత ధరల వల్ల రీఫిల్ చేయించడం మోయలేని భారంగా మారుతోంది. నోయిడాకు చెందిన పునీత్‌కుమార్ తన పాత ఐదు కిలోల చోటు సిలిండర్‌ను తిరిగి ఉపయోగించాలని భావించాడు. కానీ ఎల్పీజీ కొరత కారణంగా దాన్ని రీఫిల్ చేయించుకోలేకపోయాడు. ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో, సాధారణ 14 కిలోల సిలిండర్ కోసం వేచి ఉండడమే మంచిదనుకున్నాడు. నోయిడాలోని రాహుల్ రంజన్ కూడా కిలోకు రూ.400 చెల్లించాలని అడిగారని చెప్పారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) చట్టబద్ధంగా 'చోటు', 'మినీ', 'అప్పు' అనే ఐదు కిలోల సిలిండర్లను అందిస్తున్నాయి. కానీ వాటి లభ్యత సమస్యగా మారడం ఆందోళనకరమని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రభుత్వం సరఫరా నిలకడగా ఉంటుందని చెప్పినా.. చాలా చోట్ల పది నుంచి 45 రోజుల వరకు సిలిండర్ డెలివరీ ఆలస్యం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గొడవలకు దిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చిన్న సిలిండర్‌పై ఆధారపడే వలస కార్మికులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అధిక ధరల కారణంగా కొంతమంది తమ గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారు. నోయిడాలోని ఒక స్ట్రీట్ ఫుడ్ విక్రేత గ్యాస్ కొనలేక బొగ్గు స్టవ్‌కు మారాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ తర్వాత అతను స్వగ్రామానికి వెళ్లిపోయాడు. చిన్న సిలిండర్ ఒకప్పుడు మధ్యతరగతి వారికి గుర్తుగా ఉండేది. ఇప్పుడు అదే పేదలకు జీవనాధారం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని పొందడం కష్టమైంది. ముంబయి, ఢిల్లీ వంటి నగరాల్లో చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఈ సిలిండర్లపై ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు వాటి రీఫిల్ ధరలు అధికంగా ఉండటంతో వ్యాపారం కొనసాగించడం కష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్ దందా సాగుతోంది. పోలీసులు బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా.. అక్రమ దందా మాత్రం ఆగటం లేదు. ప్రభుత్వం ఈ మినీ సిలిండర్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వలస కార్మికులకు 30,000 సిలిండర్లు పంపిణీ చేశారు. మార్చి 23 తర్వాత 3.9 లక్షల సిలిండర్లు అమ్ముడయ్యాయి. అయితే ధర కూడా పెరిగి రూ.649కు ఎగబాకింది. ఈ సిలిండర్లు సులభంగా పొందవచ్చని కంపెనీలు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చాలా చోట్ల అవి అందుబాటులో లేవని ప్రజలు చెప్తున్నారు. బుకింగ్ చేసినా స్టాక్ లేదని చెప్పడం, హెల్ప్‌లైన్ పని చేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందిం చింది. దాని ప్రకారం...కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ–130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ–130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియలేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చనిపోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ–130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి. **పైలట్‌ను రక్షించాం : ట్రంప్** ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తు తం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపా రు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటు న్నాడని చెప్పారు. **ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది. సొలైమని బంధువు హమిదెహ్ సొలైమని అఫ్షర్‌ను, ఆమె కుమార్తెను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని, వారిని దేశం నుంచి బయటికి పంపే ప్రయత్నం జరుగుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. **కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి** గల్ఫ్‌లోని కువైట్‌పై ఇరాన్ ఆదివారం విరుచుకు పడింది. షువైఖ్ చమురు సెక్టార్ ప్రాంగణంపై డ్రోన్ దాడి జరిపింది.

# నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలో నే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలన్నింటినీ సకల సౌకర్యాలతో ఒకే ప్రాంగణంలో నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించటం అభినందనీయమన్నారు. న్యాయవ్యవస్థ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుందని చెప్పారు. మనం సిద్ధాంతం నుంచి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుందనీ, నేర్చుకోవడం మానేస్తే న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆగిపోతుందని వివరించారు. హైకోర్టు ఆడిటోరియంలో జిల్లాల న్యాయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదనీ, భద్రపరిచిన, అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పునూ బలోపేతం చేస్తాయని చెప్పారు. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వటం హర్షణీయమంటూ ప్రభుత్వ ప్రణాళికను ప్రసంసించారు. సుస్థిర మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారన్నారు. ఈ భవనం తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం కాబట్టి ఈ భూమిని గౌరవించాలని సూచించారు. కొత్త భవనం కోసం వందెకరాలు కేటాయించడమేగాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వందేండ్ల పాటు సేవలందించేలా రూపొందించిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేండ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2024లో శంకుస్థాపన చేసిన జోన్–1 పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, జోన్–2 కూడా మరో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, ఉజ్జల్ భూయాన్, ఎస్‌వీ భట్టి, అలోక్ అరధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ సెక్రెటరీ వికాస్‌రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌జీ కర్ణన్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ భవన నిర్మాణ డ్రాయింగ్‌లు, కోర్టు నమూనాలను సీజేఐ, సీఎం తదితరులు పరిశీలించారు. **ప్రార్థనా మందిరాలకంటే పవిత్రం : సీఎం రేవంత్‌రెడ్డి** కోర్టును నిర్మిస్తే ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించినట్టే. గుడి, మసీదు, చర్చి కంటే ఎక్కువగా అన్ని మతాల వారందరికీ ఇది ఒక పవిత్రమైన ప్రదేశం. తన ప్రజా జీవితంలో ఈ శంకుస్థాపన సందర్భాన్ని ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది.

# నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

**హైదరాబాద్, ఏప్రిల్ 05:** హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో రూ.ఏడు వేల కోట్ల విలువైన భూకుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. అక్కడ సర్వేనెంబర్ 613 (కొత్త సర్వే నెంబర్ 119)లో ఉన్న 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని అన్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులున్నారని ఆరోపించారు. అందుకే రక్షకులే భక్షకులుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములుగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు లేఖ రాస్తే నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఏపీఐఐసీకి అప్పగించారని గుర్తు చేశారు. కౌసల్య, మమత వంటి మహిళా రైతులు 40 ఏండ్లుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్నారని వివరించారు. వారికి రూ.ఐదు లక్షలు, రూ.పది లక్షలు ఆశ చూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారనీ, బోర్లు, కంచెలను ధ్వంసం చేశారని అన్నారు. నాదర్‌గుల్ భూములు శివరాజ్ బహదూర్‌వేనని ఆయన చెప్పినా 2005లోనే ఆర్డీవో ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని చెప్పారు. 2017లో హైకోర్టు కూడా ఇది ప్రభుత్వ భూమి అంటూ చెప్పిందన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలుండే అవకాశం లేదనీ, అయినా 2016లో శివరాజ్ బహదూర్ ఆ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ కంపెనీలకు విక్రయించారని అన్నారు. చట్టంలోని సెక్షన్ ఎనిమిది, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా భూములను అమ్మే హక్కు లేదన్నారు. ఆ విక్రయాలు చెల్లవనీ, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారని గుర్తు చేశారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆ కంపెనీలు హైకోర్టుకు వెళ్తే ఆర్డీవో నిర్ణయమే సరైనదనీ, ఆ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ స్పష్టం చేశాయని వివరించారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం వద్ద ఆ కేసు మంగళవారం విచారణకు రానుందని అన్నారు. భూభారతి పోర్టల్‌లో చూసినా అది ప్రభుత్వ భూమి ప్రొహిబిటెడ్ ల్యాండ్‌గానే చూపిస్తోందని వివరించారు. చెరువులను కాపాడుతున్నానని చెప్పే రేవంత్‌రెడ్డికి నాదర్‌గుల్ భూకబ్జాలు కనిపించడం లేదా?అని ప్రశ్నించారు. ఈ భారీ భూ కుంభకోణం, భూ కబ్జా కంపెనీల వెనుక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబమే ఉందని ఆరోపించారు. పేదల ఇండ్లు కూలగొట్టే 'హైడ్రా'కు అధికార పార్టీ నేతల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాదారులను అరెస్ట్ చేసి, రైతులను భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. నాదర్‌గుల్ భూములపై సోమవారం ఉదయం వరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకపోతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అక్కడికి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ అన్నారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా రాహుల్ పేర్కొన్నారు. అసోంకు చెందిన సుప్రసిద్ధ గాయకుడు, కీర్తిశేషులు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ భావజాలం కూడా అలాంటిదేనని, ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే తమ సిద్ధాంతమని తెలిపారు. అస్సాంలో తాము అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో దోషులను 100 రోజుల్లోగా శిక్షిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక తరగతులకు షెడ్యూలు తెగ (ఎస్టీ) హోదా ఇస్తామని, తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంగా మార్చేశారని విమర్శించారు.

# భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

(మొదటి పేజీ తరువాయి)

ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రయివేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026–27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం" అని మూడీస్ నివేదిక తెలిపింది."ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి" అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026–27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువుల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

# జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కు లేదని అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదని, కానీ జగన్‌ను చూస్తే ఆయనే గుర్తుకొస్తున్నారని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారని పార్థసారథి విమర్శించారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణివల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతిపైన, అమరావతిపైన జగన్‌కు ఎందుకంత కక్ష..? అని ప్రశ్నించారు. జగన్ మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన చెప్పారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

# నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్ళడం సంతోషకరమని అన్నారు. బిజెపి కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని జాతీయ సేవ, జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం అని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త దేశం ముందు – పార్టీ తరువాత – స్వయం చివర అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు. నలభై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని నలభై ఆరు సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తమ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణం అని ఆయన వివరించారు. గతంలో జనసంఘ్‌గా ప్రారంభమైన ఈ ప్రయాణం, 1980లో ముంబైలో అటల్ బిహారీ వాజపేయి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగా రూపుదిద్దుకుని, తన సిద్ధాంత బలం, క్రమశిక్షణ గల కార్యకర్తల శ్రమ, జాతీయ సేవ పట్ల అచంచల నిబద్ధతతో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని రాంచందర్ రావు వివరించారు. దేశంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చామని, అంతేకాక, రాబోయే కాలంలో కూడా మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించుకున్నట్టుగా స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రులైన తర్వాతనే భారత్ నిజమైన ఆర్థిక మార్పును, అభివృద్ధి యొక్క కొత్త యుగాన్ని చూడడం ప్రారంభించిందని ఆయన వివరించారు. వారిరువురి నాయకత్వం దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, మరింత బలమైన, ఆత్మనిర్భరమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది వేసిందని రాంచందర్ రావు తెలిపారు.

# తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ఆయన వివరించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత దశాబ్ద కాలం పాటు జరిగిన అభివృద్ధి గురించి కెటిఆర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం. తాము అవకాశాల కోసం ఎదురు చూడలేదు అని, వాటిని అందిపుచ్చుకునేందుకు అద్భుతమైన పాలసీలను తయారు చేశామని తెలిపారు.

# ఆప్ నేతలకు రాఘవ చద్దా కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తోసిపుచ్చారు. పార్లమెంట్‌లో తన ప్రసంగాలను తెలియచేస్తూ తాజాగా మూడు నిమిషాల వీడియోను వెలువరించారు. నిజానిజాలు ఈ దృశ్య శ్రవణ సాధనాలు తెలియచేస్తామని స్పందించారు. తనకు వ్యతిరేకంగా పార్టీలో తప్పుడు కథలతో ప్రచారానికి దిగుతున్నారని, దీనికి తాను ప్రతిస్పందన ఇచ్చుకోవల్సి ఉంటుందని తెలిపారు. రాజ్యసభలో ఆప్ ఉపనేత పదవి నుంచి ఇటీవల ఆయనను తొలిగించారు. ఇది వివాదాస్పదం అయింది. పంజాబ్ విషయాలను తాను ప్రస్తావించడం లేదని చెప్పడం కించపర్చడమే అని పేర్కొన్నారు. పంజాబ్ తనకు ఓ మైక్ అనుకోరాదని, అంతకు మించి ఓ ఇల్లు, తన ఆత్మ అని తెలిపిన రాఘవ పంజాబ్ కోసం స్పందించడం తన బాధ్యత అని తేల్చిచెప్పారు. రైతులకు కనీస మద్దతు ధరలు, భగత్ సింగ్‌కు భారత్ రత్న, భూగర్భ జలాల తగ్గుముఖం, నన్‌కానా సాహిబ్ కారిడార్ వంటి విషయాలపై మాట్లాడానని తెలిపారు. సంబంధిత వీడియోలు అందరి ముందుంచుతున్నాను మిత్రమా అని సవాలు విసిరారు. పంజాబ్ ఎమ్మెల్యేలు ఎన్నుకోవడం వల్లనే రాజ్యసభకు చద్దా వెళ్లారని, అయితే ఆయన పల్లెత్తు మాట కూడా పంజాబ్ కోసం మాట్లాడటం లేదని పంజాబ్‌లోని ఆప్ నాయకత్వం విమర్శిస్తోంది. ఆయన మౌనం దేనికి సంకేతం అని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఆప్ పంజాబ్ విభాగం అధ్యక్షులు అమన్ ఆరోరా , సీనియర్ నేత కుల్దీప్ సింగ్ ధాలీవాల్ చేస్తున్న విమర్శలకు ఇప్పుడు గౌరవప్రదంగానే రాఘవ కౌంటర్ ఇచ్చారు.

# తంగడపల్లి లో ఘనంగా మహనీయులు బాబు జాగ్జీవన్ రామ్ జయంతి



**చౌటుప్పల్,ఏప్రిల్ 05,(వార్త పత్రిక) :**చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి లో మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు జయంతి కమిటీ అధ్యక్షుడు ఉదరీ వెంకటేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.జగ్జీవన్ రాం ఏప్రిల్ 5, 1908 జన్మించారు, పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చాడు. అతను బాబూజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా వ్యవహరించాడు.1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడు.1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యాడు, ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించాడు.తాను చేసిన సేవలు స్మరించుకునారు.ఈ యొక్క కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకయ్య ,4 వ వార్డు కౌన్సిలర్ ఉదరీ యాదయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గడ్డం ఇందిరా రాజారత్నం,మాజీ ఎంపీటీసీ గ్యార కిష్టయ్య, గౌరవ సలహాదారులు ఊదరి బాబురావు ఊదరి కిషోర్ బొజ్జ బుచ్చయ్య, దాసరి లింగస్వామి, ఉప్పలపల్లి లింగస్వామి, ఇప్ప వెంకటేష్, ఊదరి శ్రీనివాస్, ఎడ్ల లింగస్వామి, ఊదరి సురేష్, ఊదరి గణేశ్ , ఊదరి మహేశ్, జనగాం సురేశ్ ,ఊదరి సుభాష్, దాసరి వినయ్, దాసరి సాయితేజ, కొండగడప వివేక్ ,ఉదరీ ప్రకాశ్ ఉబ్బు పవన్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా 119వ బాబు జగ్జీవన్ రామ్ జయంతి




**చౌటుప్పల్, ఏప్రిల్ 05,(వార్త పత్రిక) :**భారతదేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు మాజీ ఉప ప్రధాని డా బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బోయ రామచంద్రం అన్నారు.నేడు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ముందు బాబు జగ్జీవన్ రామ్‌జయంతి ఉత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడు పేదరిక దళిత జాతి నుండి ఎదిగిన మహానేత ఆయన అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలకపాత్ర పోషించి,అంబేద్కర్ కి అండగా నిలిచిన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన అన్నారు. వివిధ శాఖలకు కేంద్ర మంత్రిగా పనిచేసి, అనేక చట్టాల రూపకర్తగా నిలిచిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్ రామ్ కి యావత్ భారతదేశం రుణపడి ఉంటుందని ఆయన అన్నారు.అన్ని అర్హతలు ఉండి కూడా కొందరూ అగ్రకుల రాజకీయ నాయకుల కుట్రల ద్వారా ప్రధానమంత్రి పదవికి దూరం చేయబడ్డ దళిత నాయకుడని ఆయన అన్నారు.అనాడు కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న గొప్ప నిర్ణయాలే ఈనాడు అనేక కోట్లమంది ప్రజలకు ఉపయోగపడుతున్నాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మేడి యాదయ్య,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాము, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతల సాయిలు, సుక్క సుదర్శన్, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి,ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు దొనకొండ కృష్ణ, నాయకులు బద్రి గాలయ్య, బోయ సృజన్, ముత్యాల గణేష్, తళసింగారం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

# మహనీయుల ఆశయ సాధనలో భాగస్వామి అవుదాం

**-బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకల లో**
**- కె వి పీ ఎస్ జిల్లా నేత జిన్నా లచ్చన్న**




**వార్త ప్రతిక:-మరిపెడ :**మహనీయుల ఆశయ సాధనలో భాగస్వామ్యం కావాలని వారి ఆశయాల అమలు కోసం ఉద్యమించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్ ) మహబూబాద్ జిల్లా నేత జిన్న లచ్చన్న అన్నారు. ఆదివారం మరిపెడ మండలంలోని వెంకం పాడు గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి జరిగింది. ఈ సభకు కెవిపిఎస్ మాజీ అధ్యక్షుడు తప్పట్ల విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ సామాజిక న్యాయం సమానత్వం కోసం కుల నిర్మూలన అమలు చేయాలని కోరుతూ చట్టసభలలో పోరాడిన గొప్ప వ్యక్తి జగ్జీవన్ రావు అన్నారు. ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సంఘాలు పోరాడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అట్లాగే ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను, 14న భారత రాజ్యాంగ నిర్మాత బడుగుల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలలో పార్టీలకు అతీతంగా సామాజిక ఉద్యమకారులు, సంఘ సేవకులు స్వచ్ఛంద సంస్థలు, పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తప్పట్లు ఎల్లయ్య, తప్పట్ల వెంకన్న, మందుల చింటూ, పాల్వా ఎల్లయ్య, తప్పట్ల పాపయ్య, రామలింగం, ముత్తు లింగయ్య, పండు, సుజాత, మల్లమ్మ, వెంకటమ్మ, సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# డా. బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి శుభాకాంక్షలు



**ములుగు జిల్లా(ప్రతినిధి)ఓవార్త పత్రిక :**మేడారం గ్రామ పంచాయతిలో భారత దేశ ఉపప్రధాని డా . బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాల వేసి,కొబ్బరి కాయ కొట్టి, జయంతిని జరుపుకోవడం జరిగింది మేడారం సర్పంచ్ పీరీల భారతి - వెంకన్న మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు సంఘసంస్కర్త, రాజకీయవేత్త , భారత పార్లమెంటులో 40 ఏళ్ల పాటుగా వివిధ పదవులు నిర్వహించిన వ్యక్తి భారతదేశ ఉపప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ గారి 119 వ జయంతి శుభాకాంక్షలు తెలియచేస్తూ మీ మేడారం సర్పంచ్ పీరిల భారతి - వెంకన్న ఈ కార్యక్రమంలో మేడారం , రెడ్డి గూడెం గ్రామం పెద్దలు పాల్గొనడం జరిగింది

# చిలుకోడు గ్రామంలో గీతా కార్మికులకు సభ్యత్వ కార్డుల పంపిణీ గౌడ్ సంఘం సేవలకు ప్రశంసలు, సర్పంచ్‌కు ఘన సన్మానం



**వార్త పత్రిక, డోర్నకల్ :**మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో ఆదివారం గీతా కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పవిత్ర కంఠ మహేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో 43 మంది గీతా కార్మికులకు సభ్యత్వ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ గౌడ్ సంఘం సర్పంచ్ మంద రామారావు కార్మికులకు కార్డులను అందచేశారు ఈ సందర్భంగా మంద రామారావు గౌడ్ మాట్లాడుతూ.. సంఘ ఐక్యత, అభివృద్ధి కోసం సభ్యత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గీతా కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం గౌడ్, సంఘం సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సభ్యత్వ కార్డు కలిగి ఉండటం ద్వారా గీతా కార్మికులకు పలు రకాల సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా, ఆర్థిక సహాయం, శిక్షణ అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా గౌడ్ సంఘం అందించే పెన్షన్ సదుపాయం వృద్ధాప్యంలో కార్మికులకు ఆర్థిక భద్రతను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కార్డులు కార్మికులకు అధికారిక గుర్తింపును అందించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడంలో కూడా సహాయపడతాయి చెప్పారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన మహబూబాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ చిరంజీవి, ఎస్సై మౌనికలకు గౌడ్ సంఘం సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం వల్ల కార్మికులకు సభ్యత్వం అందించడం సులభమైందని. మంద రామారావు పేర్కొన్నార ఈ సందర్భంగా గ్రామ గౌడ్ సంఘం నాయకులు సర్పంచ్ మంద రామారావును ఘనంగా సన్మానించారు, సంఘ అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడుతూ శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ , గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర జాతీయ స్థాయిలో మెరిసిన అథ్లెట్లకు నగదు పురస్కారాలు

**- బిఆర్ఎస్ ఎల్పివిప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా సత్కారం**







**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాకు గౌరవం తీసుకువచ్చిన అథ్లెట్లను ఘనంగా సత్కరించారు. జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లిలో ఉన్న సెంట్ మాటిస్ ఇంజనీరింగ్ కళాశాల సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆడిటోరియంలో తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
2025--26 సంవత్సరానికి సంబంధించి కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మహిళలు, పురుషులు, ఓవరాల్ విభాగాల్లో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఛాంపియన్‌గా నిలిచింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి ప్రతిభ చాటింది. ఈ విజయాలలో భాగస్వామ్యమైన మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, క్రీడలు మనిషి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నిత్యజీవితంలో క్రీడలను అలవాటు చేసుకుంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్రం, దేశానికి పేరు తీసుకువస్తున్న అథ్లెట్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మర్రి లక్ష్మణ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. లక్ష్మి, ఖజాంచి శ్రీ లక్ష్మమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. పి.జె.వి. రత్నాకుమార్, జాయింట్ సెక్రటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట అభివృద్ధికి సిపిఐ పోరాటాలే పునాది: ఉమా మహేష్

**- ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అవగాహన**




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:**ం పోరాడుతున్న సిపిఐ పార్టీ, తన పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా “ఇంటింటికి సిపిఐ” కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రెండో రోజు జగద్గిరిగుట్ట పరిధిలోని బీరప్ప నగర్, దేవమ్మ బస్తీల్లో పార్టీ నాయకులు కాలనీల్లో తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజా సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా లేకపోయినా భూమిలేని పేదలకు భూములు పంచిన చరిత్ర సిపిఐ పార్టీదేనని తెలిపారు. “దున్నేవానికే భూమి” అనే నినాదంతో భూ పోరాటాలు నిర్వహించి, నిరుపేదలకు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసేలా చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందని పేర్కొన్నారు. అలా ఏర్పడిన ప్రాంతమే నేటి జగద్గిరిగుట్టగా అభివృద్ధి చెందిందని అన్నారు.జగద్గిరిగుట్ట నేడు మినీ ఇండియాగా రూపుదిద్దుకుని వివిధ రాష్ట్రాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారని, దీనికి కారణం సిపిఐ గత పోరాటాలేనని వివరించారు. కొత్తగా వచ్చిన వారికి ఈ చరిత్ర తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, బస్తీల్లో పార్టీని బలోపేతం చేయడంలో ఇది సహాయపడుతుందని అన్నారు. ప్రజలు తమ సమస్యలను సిపిఐ దృష్టికి తీసుకువస్తే, రాబోయే రోజుల్లో పోరాటాల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌తో పాటు రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి కే. స్వామి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, సహాయ కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, న్యాయవాది సత్యనారాయణ, శాఖ కార్యదర్శులు సహదేవరెడ్డి, కే. వెంకటేష్, వీరస్వామి, కొండయ్య, రాజు, నాగేశ్వరి, చంద్రయ్య, బాలరాజు, ఇమామ్, సామెల్, ఆశయ, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత మాజీ ఉపప్రదాని ప్రముఖ సంఘ సంస్కర్త దళిత దిగ్గజం బాబు జగ్జీవన్ రామ్ గారి 118 వ జయంతి శుభాకాంక్షలు

**- అణగారిన వర్గాల కోసం ఆయన జీవితమంతా పోరాడి సాధించి పెట్టారు**



**వార్త పత్రిక షాద్ నగర్ ఏప్రిల్ 05:**బొబ్బిలి పాండు ఆధ్వర్యంలో జజ్జీవన్ రామ్ జయంతి వేడుక ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త మరియు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి నీ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న జరుపుకుంటారు. ఆయన 1908 ఏప్రిల్ 5న బీహార్‌లోని చాంద్వా గ్రామంలో జన్మించారు. బాబూజీగా ప్రసిద్ధి చెందిన ఆయన, దళితుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన భారతదేశం ఆయన జయంతి ని సమతా దివస్” సమానత్వ దినోత్సవంగా గౌరవిస్తుంది.ఆయన నను బాబూజీ.అనికూడా పిలుస్తారు .ఆయన రాజకీయ ప్రస్థానం: 1936 నుండి 1986 వరకు సుమారు 50 ఏళ్లపాటు నిరంతర పార్లమెంటరీ సేవ చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు.ప్రభుత్వ పదవులు: భారత రక్షణ మంత్రిగా (1971 యుద్ధ సమయంలో) మరియు ఉప ప్రధాన మంత్రిగా సేవలు అందించారు.సేవలు: 1935లో ‘ఆల్-ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్’ స్థాపనలో కీలక పాత్ర పోషించి, అణగారిన వర్గాల కోసం పోరాడారు.ఈ కార్యక్రమంలోకళ్లేపల్లి బాలరాజ్,భూషణ్, విష్ణు, మహేందర్, శ్రీను, చింతకాయల రవి, శ్రీశైలం,దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర హైకోర్టు కు శంకుస్థాపన కార్యక్రమం





**రంగారెడ్డి జిల్లా :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్ నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ గారు, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గారు, జస్టిస్ ఎస్. వెంకట నారాయణ భట్టి గారు, జస్టిస్ అలోక్ ఆరాధే గారు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ గారు, జస్టిస్ పి. సామ్ కోషి గారు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ గారు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి గారు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు, డీజీపీ బి. శివధర్ రెడ్డి గారితో పాటు మాజీ న్యాయమూర్తులు, న్యాయకోవిదులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.వంద ఎకరాల్లో నిర్మించబడే జ్యుడీషియల్ సీటీలో భాగంగా హైకోర్టు జోన్ నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించడంతో పాటు ఈ సందర్భంగా భవన సముదాయాల నమూనాలతో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. 2027 డిసెంబర్ నాటికి తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. హైకోర్టు కొత్త భవన సముదాయ నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపడుతున్నట్టు చెప్పారు.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్ నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గారు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ గారు, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గారు, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి గారు, జస్టిస్ అలోక్ ఆరాధే గారు, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ గారితో పాటు ఇతర న్యాయకోవిదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "2023 డిసెంబర్‌లో మా ప్రభుత్వం ఏర్పడినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయాల్లో హైకోర్టుకు కొత్త భవన సముదాయాన్ని నిర్మించాలన్న నిర్ణయం ఒకటి. అందుకోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. భవనాల కోసం జోన్-1లో ఇప్పటికే ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోజు జోన్-2లో నివాస భవనాలకు ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. వీటి నిర్మాణాలను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది" అని చెప్పారు.

"న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే భవనం దేశంలోనే అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుంది.ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారపడి, గౌరవంతో పనిచేస్తాయి. సాధారణ పౌరుడు న్యాయం కోసం చివరగా ఆశ్రయించేది న్యాయస్థానాన్నే. అలాంటి న్యాయస్థానానికి కావలసిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జీవితంలో నాకు లభించిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తా" అని అన్నారు."కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వారికి వేదికగా నిలుస్తుంది. రాబోయే వంద సంవత్సరాల పాటు పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు న్యాయం కోసం ఈ మందిరానికి వస్తారు.

దేశంలో ఒక దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మించడం గొప్ప విషయం. కానీ ఒక కోర్టు సముదాయం నిర్మించడమంటే, అందుకోసం ప్రత్యేకంగా ప్రాంగణం సృష్టించడమంటే, దీన్ని ప్రజలందరి కోసం నిర్మించే ఒక పవిత్ర ఆలయంగా భావిస్తా" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

"ఇదొక ప్రత్యేకమైన సందర్భం. భారతదేశంలోని అగ్రశ్రేణి న్యాయ మేధావులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా ఉంది. ఇలాంటి సందర్భం చాలా అరుదుగా వస్తుంది. దేశంలోనే అతిపెద్ద హైకోర్టు భవన సముదాయమే కాకుండా అత్యున్నత ప్రమాణాలు, మౌలిక సదుపాయాలతో నిర్మిస్తున్నాం. ఈ భవన సముదాయం కేవలం నిర్మాణం కాదు. ఇది మా ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం. అన్ని వ్యవస్థలు పరస్పర గౌరవంతో, సహకారంతో పనిచేయాలని మేం విశ్వసిస్తాం. న్యాయవ్యవస్థ పట్ల మా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇస్తుంది.ఇది హైదరాబాద్‌కు ఒక సుదినం. వచ్చే శతాబ్దం కోసం ఒక అద్భుతమైన భవనాన్ని, ప్రజా జీవితానికి ఒక కీలకమైన స్థంభాన్ని నిర్మించడానికి ఒక అడుగు వేస్తున్న సందర్భం. న్యాయకోవిదులందరితో కలిసి ఇక్కడ ఉండటం అదృష్టంగా భావిస్తున్నా" అని ముఖ్యమంత్రి గారు అన్నారు.

# వేసవిలో తాగేందుకు ఈ రెండు జ్యూస్‌లలో ఏది బెటర్.. దేని వల్ల ఎక్కువ లాభం ఉంటుంది



ఈ ఏడాది మన దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో వేడి, డీహైడ్రేషన్ సమస్యలు సాధారణంగా మారిపోయాయి. ఇది కేవలం సీజనల్ ఇబ్బంది మాత్రమే కాకుండా రోజువారి ఆరోగ్య పోరాటంగా మారింది. చాలామంది చల్లని కూల్‌డ్రింక్స్ లేదా షుగర్ ఎక్కువగా ఉన్న స్పోర్ట్స్ డ్రింక్స్ వైపు మొగ్గుచూపుతుంటారు. అయితే ఈ తీవ్ర వేడిని ఎదుర్కొనే అసలు రహస్యం సంప్రదాయ వంటింటి పదార్థాల్లోనే దాగి ఉంది. ఈ సందర్భంలో లౌకి (సొరకాయ), అలొవెరా ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇవి రెండూ ఆయుర్వేదం, ఆధునిక పోషకాహార శాస్త్రంలో శీతల గుణాల కోసం ప్రసిద్ధి చెందాయి. అయితే వ్యక్తిగత లక్ష్యం బరువు తగ్గడమా, ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడమా, లేక వేడి వల్ల దెబ్బతిన్న పొట్టను నయం చేసుకోవడమా, చర్మ కాంతి పెంచుకోవడమా అన్న అంశం ఆధారంగా ఎంపిక మారుతుందని నిపుణులు చెబుతున్నారు.సొరకాయ జ్యూస్ అయితే..ఫంక్షనల్ ఫుడ్స్ ప్రపంచంలో సొరకాయ జ్యూస్ ప్రయోజనాలు దాని సాధారణ ప్రతిష్ట కారణంగా చాలా వరకు నిర్లక్ష్యానికి గురవుతాయి. అయితే భారతీయ వైద్య పరిశోధనా మండలి స్థానిక కూరగాయల ప్రాముఖ్యతను ఎప్పటినుంచో ప్రస్తావిస్తోంది. సొరకాయ జ్యూస్ ఆరోగ్య ప్రయోజనాలను అందరూ తెలుసుకోవాల్సిందే. ఇది దాదాపు 92 శాతం నీటితో నిండి ఉంటుంది. అందువల్ల ఇది శరీర కణాలకు అద్భుతమైన హైడ్రేషన్ అందిస్తుంది. సొరకాయ రసం తాగడం అంటే కేవలం నీరు తాగడం కాదు. మొక్క ద్వారా సహజంగా ఫిల్టర్ చేయబడిన నీటిని తీసుకోవడం, ఇది శరీరంలో త్వరగా గ్రహించబడుతుంది. వేడి కాలంలో హీట్ స్ట్రోక్ సాధారణంగా లవణాల అసమతుల్యత వల్ల వస్తుంది. సొరకాయలో సహజంగా సోడియం, పొటాషియం వంటి ముఖ్య ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయే లవణాలను భర్తీ చేసి తల తిరగడం, అలసట వంటి సమస్యలను తగ్గిస్తాయి. అధిక వేడి కారణంగా ఆసిడిటీ, హార్ట్‌బర్న్, చిరాకు వంటి సమస్యలు వస్తాయి. సొరకాయ జ్యూస్ శరీరంలో ఉష్ణోగ్రతను తగ్గించి పొట్ట ఆమ్లతను సమతుల్యం చేస్తూ సహజ శీతలకారిగా పనిచేస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు.అలొవెరా జ్యూస్‌లో..అయితే ఒక ముఖ్యమైన జాగ్రత్త తప్పనిసరి. సొరకాయ చేదుగా ఉంటే దాని రసం తాగకూడదు. చేదు రుచి క్యూకర్బిటాసిన్ అనే విషపూరిత రసాయనం అధికంగా ఉందని సూచిస్తుంది. ఇది ఫుడ్ పాయిజనింగ్, పొట్టలో పుండ్లు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి రసం తీయడానికి ముందు చిన్న ముక్కను రుచి చూసి నిర్ధారించుకోవాలి. సొరకాయ ఎక్కువ పరిమాణంలో హైడ్రేషన్ అందిస్తే, అలొవెరా పోషకాల నిల్వగా ఉంటుంది. అలొవెరా జ్యూస్‌లో 75కు పైగా సక్రియ పదార్థాలు ఉండటం విశేషం. అలొవెరాలో మ్యూకోపాలిశాకరైడ్స్ ఉండటం వల్ల శరీర కణాల్లో తేమను నిల్వ చేస్తాయి. ఇది కేవలం హైడ్రేషన్ ఇవ్వడమే కాకుండా చర్మాన్ని లోపలి నుంచి మృదువుగా, ఎలాస్టిక్‌గా మార్చుతుంది. సూర్య కిరణాల వల్ల చర్మానికి కలిగే నష్టాన్ని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. వేసవి వేడి కారణంగా జీర్ణ సమస్యలు, ఆసిడిటీ పెరిగితే అలొవెరా మంచి పరిష్కారం. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఎంజైమ్స్ అన్నవాహిక, జీర్ణాశయ పొరను రక్షిస్తూ శాంతింపజేస్తాయి.దేన్ని తీసుకోవాలి..?సాధారణ నీటితో పోలిస్తే అలొవెరాలో విటమిన్ జ, జుతో పాటు అవసరమైన అమినో ఆమ్లాలు కూడా ఉంటాయి. భారతీయ అధ్యయనాలు అలొవెరా శరీరంలో యాంటీఆక్సిడెంట్లను పెంచి, సూర్యకాంతి వల్ల కలిగే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుందని సూచిస్తున్నాయి. సొరకాయ జ్యూస్, అలొవెరా జ్యూస్ రెండింటిలో ఏది మంచిదన్నది వ్యక్తిగత అవసరంపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ హైడ్రేషన్, బరువు తగ్గడం కోసం సొరకాయ ఉత్తమం. జీర్ణాశయ ఆరోగ్యం, చర్మ సంరక్షణ కోసం అలొవెరా మరింత అనుకూలం. ఎవరి అవసరాన్ని బట్టి వారు ఎంపిక చేసుకోవాలి. హీట్ ఎగ్జాషన్ నివారించేందుకు తక్కువ ఖర్చుతో అధిక హైడ్రేషన్ కావాలంటే సొరకాయ జ్యూస్ తీసుకోవాలి. బరువు తగ్గాలనుకునేవారికి ఇది తక్కువ క్యాలరీల పానీయం. రక్తపోటు లేదా నీరు నిల్వ సమస్యలు ఉన్నవారికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

# మామిడి పండ్లు తినగానే ఇవి తీసుకుంటున్నారా.. అయితే మీ ఆరోగ్యాన్ని రిస్క్‌లో పెట్టినట్లే



వేసవి ఆగమనంతోనే మార్కెట్‌లోకి మామిడి పండ్ల రాక మొదలవుతుంది. మన దేశం మామిడి పండ్లకు ఎంతో ప్రసిద్ధి. ప్రపంచంలో మరెక్కడా లభించనన్ని రకాల మామిడి పండ్లు భారత్ లభిస్తాయి. అంతేకాదు దేశంలోని మామిడిపండ్లు రకరకాల రుచుల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మామిడి పండ్లను నేరుగా తినొచ్చు. జ్యూస్‌లుగా చేసుకుని తాగవచ్చు. మామిడి తాండ్ర, మామిడి కరేలా లాంటి పదార్థాలు తయారు చేసుకుని కూడా తినొచ్చు. అయితే ఈ మామిడిపండ్లు తిన్న తర్వాత ఓ ఐదు రకాల పదార్థాల జోలికి అస్సలు పోవద్దట. ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..

మంచి నీళ్లు : మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతసేపటి వరకు మంచినీళ్లను అస్సలు తాగొద్దట. అలా చేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందట. కడుపు నొప్పి, అసిడిటీ, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట.

పెరుగు : మామిడి పండు తినగానే పెరుగు తీసుకుంటే శరీరం డీహైడ్రేట్ అవుతుందట. అందువల్ల అలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలట. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందట. అంతేగాక చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉన్నదట.కాకరకాయ : మామిడి పండ్లు తిన్న తర్వాత కాకరకాయ తీసుకోవడం కూడా మంచిది కాదట. అలా చేయడంవల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయట.

ఘాటైన పదార్థాలు : మామిడి పండ్లు తిన్న తర్వాత ఘాటు పదార్థాలుగానీ, కారం పదార్థాలుగానీ తీసుకుంటే ఉదర సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట. అంతేగాక ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నదట.చల్లటి పానీయాలు : మామిడి పండ్లతోపాటు చల్లటి పానీయాలు తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమట. చల్లటి పానీయాలతో మామిడి పండ్లను తీసుకోవడంవల్ల షుగర్ లెవల్స్ మరింత పెరుగుతాయట.

## మల్లంపేట్‌లో నూతన కార్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 5:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ కేవీఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "కిరణ్ కార్ సర్వీస్ సెంటర్"ను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యాపార సంస్థలు అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించడం ద్వారా వ్యాపారం మరింత విస్తరించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ఈ సర్వీస్ సెంటర్ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, వాహన యజమానులకు సౌకర్యవంతమైన సేవలు అందించనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అర్కల అనంత స్వామి ముదిరాజ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, టాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు జలిగం రాకేష్, కుంట్ల నందు, ఈ శ్రీనివాస్, యువ నాయకులు మాదాస్ ఆదిత్య, అనిల్ రెడ్డి, మల్లేష్, నిర్వాహకులు బెజ్గాం శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శుభాకాంక్షలు



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీకి నూతనంగా నియమితులైన సభ్యులను మాజీ శాసనసభ్యులు, పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ఘనంగా సన్మానించారు. షాపూర్ నగర్‌లోని తన నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా నియమితులైన కూన శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైన రాము గౌడ్, జిమ్మీ దేవేందర్, కార్యదర్శులుగా నియమితులైన మోటె శ్రీనివాస్ యాదవ్, బొబ్బ రంగారావు, బుచ్చి రెడ్డి, అలాగే కార్యవర్గ సభ్యులుగా నియమితులైన బాలప్ప, ఎర్వ వెంకట్ రమణలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు, కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

## ఇందిరమ్మ కాలనీలో అంబేద్కర్ సామూహిక భవనం ప్రారంభం

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామూహిక భవనాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభించారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన ఈ భవనం సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడనుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలు, పోరాటాల ఫలితంగానే సమాజంలో సమాన హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజలు ఈ సామూహిక భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మురళి యాదవ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, 125 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయరాం రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి, బైండ్ల గోపాల్, వార్డ్ అధ్యక్షుడు కామేశ్వరరావు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎల్లయ్య, స్థానిక నాయకులు బాబి, భూషణ్, బాబన్న, రాజు, ప్రభాకర్, శ్యామ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి


### నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ నివాళులర్పించారు. సూరారం శివాలయం నగర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, దేశ నిర్మాణంలోనూ విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ఉన్నత పదవులు అలంకరించినప్పటికీ సాధారణ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## దివంగత కుంట గోపాల్‌కు ఘనంగా నివాళులు
## దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు కుంట గోపాల్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నేపథ్యంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తన సానుభూతిని వ్యక్తం చేశారు. కుంట గోపాల్ సామాజిక సేవలో చురుకైన వ్యక్తిగా ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీ రామాంజనేయ యువజన సంఘం అధ్యక్షుడిగా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, ఖుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. గోపాల్ మరణం కుత్బుల్లాపూర్ ప్రాంతానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బౌరంపేట్‌లో అంబేద్కర్ సామూహిక భవనం ప్రారంభం

**- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం**




**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** జీహెచ్ఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామూహిక భవనాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. కాలనీ ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఈ భవనం స్థానికులకు ఉపయోగకరంగా ఉండనుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి, రాజ్యాంగ రచన ఫలితంగానే నేటి సమాజంలో అందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని అన్నారు. ఈ సామూహిక భవనాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, నాచారం మురళి యాదవ్, బెంబడి బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ముందుండే నాయకుడు
## బోదాస్ రవి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**వార్తాపత్రిక, ఉప్పల్, ఏప్రిల్ 5:** గ్రేటర్ హైదరాబాద్ జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు, కాప్రా సర్కిల్ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ బోదాస్ రవి జన్మదినోత్సవం మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్ లు పాల్గొని బోదాస్ రవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోదాస్ రవికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ“బోదాస్ రవి సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే వ్యక్తి అని వడ్డెర సంఘం అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని, సామాన్య ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఆయన చూపుతున్న అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజానికి ఇంకా సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్ మాట్లాడుతూ, బోదాస్ రవి సంఘానికి బలమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని, ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి పల్లె క్రిష్ణ, జెరుపటి రాజు, ఆంజనేయులు, మధు, కృష్ణయ్య, గంగాధర్, నాగార్జున, గుంజ ఆంజనేయులు, ద్యారంగుల రమేష్, శివమ్మ, అశోక్ కుమార్, రామచంద్రయ్య, సంఘ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## గాజుల రామారావు చౌరస్తాలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు




**కత్న బుల్లాపూర్, 5ఏప్రిల్ ( వార్తాపత్రిక) :** కతుబుల్లాపూర్ నియోజక వర్గం లోని గాజులరామారం చౌరస్తాలో125-డివిజన్ లో బాబు జగ్జీవన్ రావ్ జన్మదిన వేడుక సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఫాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్ గాజులు రామారావు చౌరస్తాలో బాబు జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలను వేసి తరువాత తను మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు స్వాత్రంత్ర సమర యోధుడు, సంఘ సంస్కార్త, రాజకీయావేత జగ్జీవన్ రావు అని కొనియాడారు. కనుక అయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వారు గుర్తు చేశారు. తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, డి ఐ లక్ష్మణ్, శివయ్య, ప్రసాద్, దేవునిసతయ్య, కిష్టయ్య, నిరుడి పెంటయ్య, రంజాన్ సమ్మయ్య, గౌస్, తదితర నాయకులు పాల్గొన్నారు,

## నేడే రాళ్లగూడ లో లక్ష్మీ గణపతి యంత్ర ప్రతిష్టాపన మహోత్సవం

**- భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలి**
**- మాజీ కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్**



**వార్త పత్రిక, రాజేంద్ర నగర్, ఏప్రిల్ 05 :** నేడు శంషాబాద్ పురపాలక పరిధిలో శ్రీ లక్ష్మీ గణపతి యంత్ర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని లక్ష్మీ గణపతి దేవాలయ కమిటీ ధర్మకర్తలు బండి భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని ప్రకాష్ నగర్ రాల్లగూడ లో నేడు అనగా సోమవారం ఉదయం 11 గంటల 52 నిమిషాలకు అనురాధ నక్షత్ర యుక్త యంత్ర ప్రతిష్టాపన ముహూర్తం గణపతి పూజ, స్వస్తి పుణ్యవచనం సర్వతోభద్ర మండలి, నవగ్రహ పూజ గణపతి అహనము, 54 కలశాలతో అభిషేకము, యంత్ర ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగు తాయని కావున భక్తులందరూ సకాలంలో విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి దివ్య దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని బండి శ్రీకాంత్ భాగ్యలక్ష్మి యాదవ్ తెలిపారు.

## ఆర్కే వాకర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో టీ షర్ట్ల పంపిణీ



**- మరిపెడ ఎస్సై వీరభద్ర రావు**

**వార్త ప్రతిక :-మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని నవీన్ సార్ గెస్ట్ హౌస్ నందు ఆర్కే వాకర్ అసోసియేషన్స్ వారికి శ్రీ సాయి లక్ష్మి జువెలరీ వర్క్ మాసబత్తిని సతీష్ఆధ్వర్యంలో టీ షర్ట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మరిపెడ ఎస్సై వీరభద్రరావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. సందర్భంగా మరిపెడ ఎస్సై వీరభద్రరావు ఆదివారం మాట్లాడుతూ. ఆర్కే వర్కర్స్ అసోసియేషన్స్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరపాలని ,మార్నింగ్ వాకింగ్ ద్వారా ఆరోగ్యం కోసం వాకి స్టెప్స్ ప్రతిరోజు మనం నడిచే అడుగుల సంఖ్య 5000 నుండి 10000 అడుగులు వేగంగా నడవడం వల్ల గుండె ఆరోగ్యం బరువుని అంతరణ మరియు శారీరక దృఢత్వం పెరుగుతాయి. డయాబెటిస్ రక్తపోటు అదుపులో ఉంచడానికి సహాయపడే సులభమైన నడక. రోజువారి అడుగులు వేయడం ద్వారా ఆరోగ్యానికి మంచిది. గుండె రోజుకు 30 నిమిషాలు వేగవంతమైన నడక రక్తప్రసరణను.మెరుగుపరుస్తుంది మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది నిరంతరం నడవడం వల్ల శరీరంలోని అదనపు క్యాలరీలు కరిగి బరువును తగ్గిస్తాయి. ఒత్తిడి ఆందోళనతకి మెదడు పనితీరును మెరుగుపడుతుంది ప్రతిరోజు నడవడం వల్ల ఎముకలు కండరాలు బల పడతాయి. ఈ కార్యక్రమంలో ఆర్కే వర్కర్స్ అసో సియేషన్ మరియు సన్రైజర్ స్ట్రైకర్స్ కీండాకారులు అందరూ తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్ళాలి


**- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**వార్త పత్రిక, రాజేంద్రనగర్, ఏప్రిల్ 05:** బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాద్లోని నాంపల్లిలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు అయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు.స్వతంత్ర భారతదేశ తొలి దశలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేశారని, తదనంతరం రాజకీయాలలో ఎదుగుతూ కేంద్ర వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా సేవలందించి, ఉప ప్రధానమంత్రిగా దేశానికి కీలక సేవలు అందించారని తెలిపారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను స్మరించారు. బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దళిత వర్గాలకు రిజర్వేషన్ల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు కార్మిక, వ్యవసాయ, రక్షణ మంత్రిగా, ఉప ప్రధాన మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కొరకు మనం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ లో ఘనంగా మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు

**- అంబేద్కర్ చౌరస్తాలో ఘన నివాళులర్పించిన బిఆర్ఎస్ నేతలు**



**వార్త పత్రిక , రాజేంద్రనగర్, ఏప్రిల్ 05 :** పురపాలక పరిధిలో బాబు జగ్జీవన్ రావ్ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బీఆర్ఎస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని ఆదివారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన ప్రదీప్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు.అలాగే ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చిన్నగండు రాజేందర్, కోణమొల్ల శ్రీనివాస్, బి. మల్లేశ్ ముదిరాజ్, వీరమల్ల హన్మంత్ ముదిరాజ్, రాచమల్ల జయసింహ, గుంటి చరణ్, ఆర్. రమేశ్, బాత్కు మహేశ్ యాదవ్, పరందములు, పోతుగంటి ప్రభాకర్, బక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి లో ఘనంగా ఈస్టర్ వేడుకలు



**వార్తాపత్రిక:టేకులపల్లి,ఏప్రిల్ 5 :** టేకులపల్లి మండలం సులానగర్ ఆర్ సి ఎం చర్చిలో ఫాదర్ మార్నేని అర్లయ్య,టేకులపల్లి బీ కాలనీ తండాలో ని పెంతే కోస్తూ ప్రార్థన మందిరం ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ జి.రాజు రామచందర్,సోనియామ్మ ఆధ్వర్యంలో ఘనంగా ఈస్టర్ వేడుకలు జరిగాయి.దేవాలయంలో ఫాదర్ మార్నేని అర్లయ్య ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వాక్యాన్ని బోధిస్తూ నేడు ఏసు క్రీస్తు సమాధి నుంచి సజీవుడై పునరుత్థానం చెందిన దినం అని,హింస ద్వేషాలు మరణాన్ని ఇస్తాయి,ప్రేమా,క్షమాపణలు జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయి ఇది నిరూపించడానికె సమాధి నుంచి సజీవుడై తిరిగి వచ్చాడు క్రీస్తు అన్నారు.అనంతరం ఆలయంలో కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగిస్తూ భక్తులు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈస్టర్ ఫుడ్ స్వీకరించారు.మాలపల్లి గ్రామంలో ఆర్ సి ఎం చర్చిలో పేదలకు,వితంతువులకు, చీరలు పంపిణీ చేసిన ఫాదర్ మార్నేని అర్లయ్య.ఈ వేడుకల్లో ఆర్ సి ఎం చర్చి యూత్ ,చింతమల్ల వీరస్వామి,అంతోటి రాకేష్,చింతమల్ల రాజు,ఉండేటి సుమంత్,దామల్ల శశి,మెట్టు రాజేష్,బల్లెం థామస్,తరుణ్ గండమల్ల విజయరాజు,రవి, తదితరులు పాల్గొన్నారు.


## నిజాంపేట్ ఎస్ఎన్‌డీపీ పనుల్లో అవకతవకలు విజిలెన్స్ విచారణ కోరిన ఆకుల సతీష్



**వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ అభివృద్ధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పూర్తి కాకముందే కోట్ల రూపాయల చెల్లింపులు జరగడంపై వెంటనే విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల పేరుతో ప్రజా ధనం దుర్వినియోగం జరుగుతోందని ఆకుల సతీష్ ఆరోపించారు. మొత్తం 9 పనుల్లో ఎస్ఎన్‌డీపీకి సంబంధించిన మూడు కీలక పనులు ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. అయినప్పటికీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సన్నిహితుడిగా చెప్పబడుతున్న కాంట్రాక్టర్ పి. సుధాకర్‌కు సుమారు రూ. 84 కోట్ల మేర చెల్లింపులు జరగడం అనుమానాలకు తావిస్తోంది అన్నారు.ప్రభుత్వ నిధులు సరిపోకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ ద్వారా అదనంగా రూ. 30 కోట్లు విడుదల చేయించారని ఆరోపించారు. పనులు పూర్తికాకుండానే ఇంత భారీగా చెల్లింపులు జరగడం వెనుక ఉన్న కారణాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ వ్యవహారం మొత్తం ప్రజా ధన దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. ఎస్ఎన్‌డీపీ పనుల అమలులో జరిగిన అనుమానాస్పద చెల్లింపులపై ఎమ్మెల్యే కేపీ వివేకానందతో పాటు కాంట్రాక్టర్ పి. సుధాకర్‌పై తక్షణమే విజిలెన్స్ విచారణ చేపట్టి నిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. లేదంటే, దీనిపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మురళి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి జయంతి వేడుకలు


**- పాల్గొన్న బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి ఉపాధ్యక్షులు తలారి ప్రేమ్ కుమార్**



**బండ్లగూడ :** బండ్లగూడ అంబేద్కర్ చౌరస్తాలో మరియు హైదర్షాకోట్ జెండా దగ్గర బాబు జంజీవన్ రాయి వేడుకలు ఘనంగా నిర్వహించారు”అనంతరం స్థానిక నాయకులు మాట్లాడుతూ” పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చాడు. అతను బాబూజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా వ్యవహరించాడు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యాడు, ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించాడు. అని మాట్లాడారు ఈ కార్యక్రమంలో, రవీందర్ రెడ్డి, డాప్పు నవీన్, అనుకం శ్రీనివాస్, కొరివి గణేష్, భోగాల శ్రీనివాస్, తలారి రమేష్, అరుణ్ కుమార్, మదర్, గోనె నరేందర్, నరసింగరావు, హైదర్షాకోట్ అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు, పాల్గొన్నారు.

## మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న గోపాలపురం ఉపసర్పంచ్ , కేయూ జేఏసీ నాయకులు





**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక :** తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు ఇష్టమైన పసుపు కుంకుమ బంగారం ( బెల్లం ) కొబ్బరికాయలు చీరె సారే సమర్పించి ప్రత్యేక మొక్కలు చెల్లించిన గోపాలపురం ఉప సర్పంచ్ ఏక్ అనీల్ ఆద్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులు దుప్పటి కిషోర్ దుబ్బటి సుభాష్ కాడపాక రాజేందర్ ఏక్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ 2 ఏళ్లుగా లేఖలతోనే సరి - నీటిపారుదల శాఖకు 21 లెటర్స్



**హైదరాబాద్ :**మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేసిన కూడా ప్రాజెక్టు ఇంజినీర్లు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టలేకపోయారు. కాళేశ్వరం ఈఎన్సీ నెల క్రితమే చీఫ్? ఇంజినీర్?కు లెటర్? రాసిన ఇప్పటికీ దానిపై ఎటువంటి స్పందనా కనిపించలేదు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ప్రభుత్వం స్పష్టత చేస్తున్నా ప్రాజెక్టు ఇంజినీర్లు మాత్రం ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.లేఖ రాసినా స్పందన లేదు : నిర్మాణ సంస్థకు తుది నోటీసు జారీ చేయాలని తీసుకొన్న చర్యలను తమకు నివేదించాలని నీటిపారుదల శాఖ లేఖ రాసినా ప్రాజెక్టు ఇంజినీర్లు మాత్రం ఈ దిశగా చర్యలు తీసుకోలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు నిర్మాణ సంస్థ, నీటిపారుదల శాఖ ప్రాజెక్టు ఇంజినీర్లు రాసిన లేఖలన్నింటినీ జత చేసి చర్యలు తీసుకోవాలని, ఏం చర్యలు తీసుకొన్నది తమకు తెలపాలని, ఫిబ్రవరిలో ఈఎన్సీ కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాసినా ఇప్పటి వరకు స్పందన లేదని తెలిసింది.2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో పాటు ఏడో బ్లాక్ పియర్స్ బీటలు వారాయి. దీనిపై విచారణ చేసిన విజిలెన్స్ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ - పీఈఎస్ సంస్థపై చర్యకు సిఫార్సు చేయడంతో పాటు పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని పేర్కొంది. 3 బ్యారేజీలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని, నిర్మాణ సంస్థ ముందుకు రాకపోతే ప్రభుత్వమే పూర్తి చేసి తర్వాత రికవరీ చేయాలని సిఫార్సు చేసింది.సర్టిఫికెట్‌ను రద్దు చేసిన ప్రభుత్వం : రెండు నివేదికలూ వచ్చి నెలలు గడుస్తున్నా, ఈ దిశగా చర్యలు మాత్రం లేవు. మరోవైపు నిర్మాణ సంస్థ ఇప్పటివరకు నీటిపారుదల శాఖకు 21 లేఖలు రాసింది. పునరుద్ధరణ బాధ్యత తమది కాదని డిజైన్ లోపం వల్లే బ్యారేజీకి నష్టం వాటిల్లిందని, అనుబంధ ఒప్పందం చేసుకొంటేనే పనులు చేస్తామని స్పష్టం చేసింది. ఈ సంస్థకు పని పూర్తయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. బ్యారేజీ ప్రారంభించిన సంవత్సరంలోనే లోపాలు గుర్తించి కింది స్థాయి ఇంజినీర్లు లేఖలు రాసినా మరమ్మతులు చేయలేదు.లేఖలు రాసినా పట్టించుకోని నీటిపారుదల శాఖ : డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లో ఉన్నప్పుడే సమస్యలను గుర్తించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లేఖలు రాశారు. అప్పుడే స్పందించి ఉంటే బ్యారేజీకి తీవ్ర నష్టం వాటిల్లేది కాదన్న అభిప్రాయం కూడా ఇంజినీరింగ్ వర్గాల్లో వ్యక్తమైంది. కింది స్థాయి ఇంజినీర్లు లోపాలు గుర్తించి మరమ్మతులు చేయాలని లేఖలు రాస్తున్నా, పై స్థాయి ఇంజినీర్లు ఇవేమీ పట్టించుకోకుండా పని పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చేశారు. బ్యాంకు గ్యారంటీలు తిరిగి ఇచ్చేశారు. విజిలెన్స్, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ లోపాలన్నింటినీ ఎత్తిచూపి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసినా నీటిపారుదల శాఖ పట్టించుకోలేదు.లేఖలు రాయడంతోనే గడిచిపోయిన రెండేళ్లు : మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద నీటిపారుదల శాఖ మంత్రి వద్ద జరిగిన సమీక్షా సమావేశాల్లో పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ సంస్థకు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఒప్పందంలోని నిబంధనలను పొందుపరిచి నీటిపారుదల శాఖ ప్రాజెక్టు ఇంజినీర్లకు, ప్రాజెక్టు ఇంజినీర్లు నిర్మాణ సంస్థకు, నిర్మాణ సంస్థ తిరిగి ప్రాజెక్టు ఇంజినీర్లకు లేఖలు రాయడంతోనే రెండేళ్లు గడిచిపోయాయి.చివరి నోటీసు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలని 3 నెలల కిందట ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయం లేఖ రాసినా ప్రాజెక్టు ఇంజినీర్ల నుంచి సమాధానం రాలేదు. నెల క్రితం మొత్తం 34 ఉత్తర ప్రత్యుత్తరాల వివరాలతో లేఖ రాసి చర్యలు తీసుకోవాలని ఏం తీసుకొన్నది తమకు తెలపాలని కోరినా ఎలాంటి సమాధానం లేదని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై మంత్రి మళ్లీ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది.

# తెలంగాణాలో ఈ అరాచకం ఏమిటి



**ఇల్లెందు, ఏప్రిల్ 5:** తెలంగాణ తొలి ముఖ్యమ ంత్రి, ప్రతిపక్ష నాయకులు, గజ్వేల్ నియోజ కవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ గూండాల దాడికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు దిండి గాల రాజేందర్ ,పార్టీ శ్రేణులు. నల్ల జెండా లతో నిరసన తెలిపారు. క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ గూండాల దాడికి నిరసనగా ఆదివార ం నల్ల జెండాలతో నిరసన ర్యాలీని దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో తెలంగాణా తల్లి (జగదాంబ) సెంటర్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భ ంగా రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ క్యాంపు కార్యాలయం అంటే ప్రభుత్వం ప్రతిపక్ష నాయకునికి కేటాయించిన సెమి రెసిడెంట్.. కుంటి సాకులతో దానిపై దాడికి దిగి ధ్వంసం చేసి భీభత్సం సృష్టించడమంటే ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడమేనని... అంటే తెలంగాణా జాతిపిత తెలంగాణా తొలి ముఖ్యమంత్రి పై చేసిన దాడి, అంతేకాదు యావత్ తెలంగాణా జాతి మీద జరిగిన దాడి ఇది. స్వయంగా ముఖ్యమంత్రి హోమ్ శాఖ మంత్రిగా ఉన్న రాష్ట్రంలో పట్టపగలు కాంగ్రెస్ గుండాలు ప్రయివేట్ సైన్యంలా వ్యవహరిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు ప్రశాంతంగా అభివృద్ధికి నిలయమైన తెలంగాణాలో ఈ అరాచకం ఏమిటి. గజ్వేల్ రాజకీయ పరిణామ లు రాష్ట్రంలో ప్రజా వాగ్దానాలను నెరవేర్చ డంలో విఫలమైన రేవంత్ సర్కార్ చిల్లర పనులతో చిల్లర రాజకీయాలు చేస్తుంది.మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంపై వందల మంది చూస్తుండగా పట్టపగలు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయమని రాజేందర్ విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంపై వందల మంది చూస్తుండగా పట్టపగలు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం శోచనీయమని రాజేందర్ విమర్శించారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ దుండగులను వెంటనే గుర్తించి,అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని రాజేందర్ డిమాండ్ చేసారు.

# రేషన్ షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్ :** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ () ఆదివా రం బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్ బస్తీలో రేషన్ షాప్ ( ) ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పూర్తిస్థాయిలో ఇవ్వడం, గోధుమలు ఇవ్వడంలేదని రేషన్ లబ్ధిదారులు వెల్లడించారు. గోధుమలు ఎందుకు ఇవ్వడం లేదని నిర్వాహ కుడిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇస్తున్నా మని చెప్పగా, ఇవ్వడం లేదని స్థానికులు చెప్పడంతో రేషన్ షాప్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాల ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు.స్థానికంగా ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయం 3వ వార్షికో త్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నా రు. అనంతరం నిర్వాహ కులు ఆయనను సన్మా నించారు. కార్యక్రమ ంలో ఆలయ కమిటీ సభ్యు లు నగేష్, అశోక్ యాదవ్, ప్రశాంతి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షు డు శ్రీనివాస్ గౌడ్, ఆరీఫ్, నరేష్ ఉన్నారు.

# డ్రగ్స్ నెట్‌వర్క్‌లో రోహిత్ రెడ్డి సోదరుడే కీలకం సిట్ దర్యాప్తులో ఎన్నో కొత్త విషయాలు




**హైదరాబాద్ :**మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ, కాల్పుల కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తున్నాం యి. రోహిత్ రెడ్డి అక్రమ లావాదేవీలకు ఆయన సొంత సోదరుడు రితేష్ రెడ్డి బినామీగా వ్యవహరిస్తున్నట్లు సిట్ బృందం దర్యాప్తులో తేలింది. ఆరోజు డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో రితేష్ రెడ్డి పాత్ర కేవలం అతిథిగా మాత్రమే లేదని మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన అనేక ఆర్థిక వ్యవహారాలను, ఆస్తులను రితేష్ తన పేరు మీద నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభిం చాయి. డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న వ్యక్తులతో జరిపిన లావాదేవీల వెనుక రితేష్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.మరో కస్టడీ పిటిషన్ : రితేశ్ రెడ్డి బినామీ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన అధికారులు కొన్ని ప్రాథమిక ఆధారాలను సైతం అధికారులు సేకరించారు. రోహిత్‌రెడ్డి తరఫున రితేశ్ కొన్ని లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో బయటపడ్డాయి. వీరిద్దరి బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలు పరిశీలించినప్పుడు అనుమానాస్పద నగదు, ఆన్‌లైన్ లావాదేవీలు గుర్తించారు. పోలీస్ కస్టడీలో వీటి గురించి ప్రశ్నించినప్పుడు నిందితులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వలేదని వీటి వెనుక నిజాలు నిగ్గుతేల్చేందుకు మరో 3 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు ఉప్పర్‌పల్లిలోని న్యాయస్థానంలో సమాధానాలతో సరి : రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి.. దిల్లీ వ్యాపారి నమిత్ శర్మను పోలీసులు ఈ నెల 15న అరెస్టు చేసి రెండు విడతల్లో 6 రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. మరో మూడు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ శనివారం పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం వాదనలు వింటామని న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ సందర్భంగా నిందితులు విచారణకు సహకరించడం లేదంటూ పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 1 నుంచి మూడు రోజులు కస్టడీకి తీసుకుని విచారించినా ముగ్గురు నిందితులు ఏమాత్రం సహకరించడం లేదని కస్టడీ పిటిషన్‌లో పేర్కొన్నారు. డ్రగ్స్ ఎలా వచ్చాయి ఎవరు అందించారు లావాదేవీలు ఎలా జరిగాయి ఇతరుల ప్రమేయం గురించిటిషన్‌లో వెల్లడించారు. కొన్ని ప్రశ్నలకు పొడిపొడి సమాధానా లిస్తున్నారు. డ్రగ్స్ పార్టీల కోసం ఎక్కడికి వెళ్లారు? హోటల్ బుకింగ్‌ల గురించి లోతుగా ఆరా తీసినా పూర్తి వివరాలు ఇవ్వడం లేదని కస్టడీ పిటిషన్‌లో తెలిపారు.డ్రగ్స్ సరఫరాకు మూలాలెక్కడ? : డ్రగ్స్ పార్టీలు జరిగినప్పుడు వీరితో పాటు పాల్గొన్న వినియోగదారుల గురించి సమాధానాలివ్వడం లేదని తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎంతో మంది అనుమానితుల పేర్లు వెలుగులోకి వస్తున్నా వీరి గురించి పూర్తి సమాచారం రావాలని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారంతో పాటు మత్తు పదార్థాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు మరిన్ని సేకరించాల్సి ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. వాస్తవాలు సేకరించాలన్నా, పరారీలో ఉన్న మరికొందరు నిందితుల్ని గుర్తించి అరెస్టు చేయాలన్నా వీరిని కస్టడీకి తీసుకోవడం తప్పనిసరి. వారిచ్చిన వాంగ్మూలాలను పరిశీలించి డ్రగ్స్ సరఫరా గొలుసును ఛేదించాలి. నిందితుల డ్రగ్స్ పార్టీల వెనుక భారీ నెట్‌వర్క్‌తో పాటు ఎంతో మంది పెద్దర్లు, నిర్వాహకులు ఉన్నారు. గతంలో డ్రగ్స్ పార్టీలు చేసుకున్న ప్రాంతాలకు వెళ్లి, కొన్ని ఆధారాలు సేకరించాల్సి ఉంది. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి మధ్య ఆన్‌లైన్ లావాదేవీల వెనుక ఇతరుల పాత్ర గురించి ప్రశ్నించాల్సి ఉంది. దిల్లీకి చెందిన వ్యాపారి నమిత్‌శర్మ అతడి చిరునామా, నేపథ్యం, నేర చరిత్ర గురించి సమర్పించిన ఆధారాలను తనిఖీ చేయాల్సి ఉందని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు.

# కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు పెట్టే యోచనలో కవిత.. పాత పేరు, కొత్త అజెండా.. సిద్దిపేట, గజ్వేల్‌లో పోటీకి రెడీ



**హైదరాబాద్ :**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత .. కొత్త పార్టీ పెట్టే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భా వోత్సవం ఉంటుందని ఇప్పటికే ప్రకటించిన కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లను.. జాగృతి చూసుకుంటోందని వెల్లడిం చారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం వద్ద కొత్త పార్టీకి సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఇప్పటికే తెలిసింది. అయితే తాజాగా కొత్త పార్టీకి సంబంధించి కవిత చేసిన వ్యాఖ్యలు.. తీవ్ర ఆసక్తికరంగా మారాయి. తన కొత్త పార్టీకి టీఆర్ఎస్ పేరు పెట్టేందుకు కవిత, జాగృతి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు రావడం ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది.రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఇప్పుడు ఖాళీగా ఉందని.. తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేయడం సరికొత్త చర్చకు దారి తీస్తోంది. అదే సమయంలో పాత పేరు, కొత్త జెండా, అజెండాతో తెలంగాణ ప్రజల ముందుకు వస్తానని చెప్పడంతో.. కొత్త పార్టీకి టీఆర్ఎస్ అనే పేరు పెడతారా అనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం టీఆర్ఎస్ పేరును ఎవరైనా వాడుకోవచ్చని వ్యాఖ్యలు చేసిన కవిత.. తమ పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఒకవేళ పార్టీకి టీఆర్ఎస్ పేరు పెట్టినా జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని కవిత చెప్పినట్లు తెలుస్తోంది.తెలంగాణ రాష్ట్ర సమితి పేరు పెట్టాలనే ఆలోచన చేస్తున్నామని.. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా జాగృతి టీమ్ పని చేస్తుందని కవిత తెలిపారు. బిహార్ సిద్ధాంతాలు తమ పార్టీలో ఉండవని తేల్చి చెప్పారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపం వద్దకు వెళ్తామని చెప్పారు. ఆరోజున స్టేజ్ పైన ఉద్యమ కారులు ఉంటారని తెలిపారు. డీఎస్పీ విశారదన్ మహరాజ్‌తో కలిసి తాము పనిచేస్తామని కవిత వెల్లడించారు. తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ధనిక పార్టీ అని ఆరోపించారు.ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చేస్తాను అనే దానిపైనా కవిత హింట్ ఇచ్చారు. సిద్దిపేట నియోజకవర్గంలో మహిళా రిజర్వేషన్లు వస్తే తప్పకుండా పోటీ చేస్తానని కవిత తేల్చి చెప్పారు. గజ్వేల్‌లో మహిళా రిజర్వేషన్ వచ్చినా ఆలోచిస్తానని తెలిపారు. నిజామాబాద్‌లో కూడా చాలా సీట్లు ఈ సారి మహిళా రిజర్వేషన్‌లోకి వస్తాయని పేర్కొన్నారు. కేసీఆర్ కష్టపడితేనే టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని.. అలాగే జాగృతి కోసం తాము కష్టపడతామని కవిత వెల్లడించారు. ఆడబిడ్డకు ఓటేయడం అనేది ఒక ఎమోషన్ అని పేర్కొన్నారు. తాను భగవద్గీత చాలాసార్లు చదివానని.. ఇంకా చదువుతూనే ఉన్నట్లు చెప్పిన కవిత.. అందులో ఉన్న నీతి చాలా గొప్పదని.. యుద్ధం చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే!



**హైదరాబాద్ :**జూబ్లీహిల్స్ పరిధిలోని కేబీఆర్ పార్క్ వద్ద జరుగుతున్న స్టీల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా ఉండేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేను అమలు చేయాలని భావిస్తు న్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రయల్ రన్ నిర్వహించా రు.పంజాగుట్ట నుంచి మాదాపూర్ వెళ్లే వాహనాలను రోడ్డు నంబర్ 2 నుంచి వన్‌వేగా మళ్లించారు. అంటే టీవీ9 ఆఫీసు నుంచి వచ్చే వాహనాలను కేబీఆర్ పార్క్ వద్ద ఎడమ వైపునకు మళ్లించారు. అక్కడి నుంచి తెలంగాణ భవన్, సీవీఆర్ జంక్షన్, బాలకృష్ణ నివాసం మీదుగా జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, మాదాపూర్ వెళ్లే విధంగా ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. ట్రయల్ రన్‌లో భాగంగా ఇవాళ రెండు గంటల పాటు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేను అమలు చేశారు. ఇందులో తలెత్తిన సమస్యలు, లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత.. ఈ రూట్‌లో వన్‌వే అమలు చేయాలా? వద్దా? అనే దానిపై ట్రాఫిక్ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

# స్కూటీని ఢీకొట్టి.. 5 కిలోమీటర్లు లాక్కెళ్లిన డీసీఎం.



**హైదరాబాద్:** మాదాపూర్‌లో ఓ డీసీఎం వాహ నం బీభత్సం సృష్టించింది. ఓ స్కూటీని ఢీకొట్టి 5కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడ యాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళ్తే.. కేరళకు చెందిన హనియ్యా ఆయేషా (22), అబ్దుల్ బాసిత్ దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడే మహే శ్వరం సమీపంలో ఉంటూ మలబార్ జువెల్లరీ షాపులో పనిచేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే విధులు పూర్తి చేసుకు న్న దంపతులు.. చిన్న షాపింగ్ చేసుకుని ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో మాదా పూర్ మైండ్ స్పేస్ సమీపంలో వారి స్కూటీని ఓ డీసీఎం ఢీకొట్టింది.స్కూటీ టైర్ల కింద ఈడ్చుక ంటూ వస్తున్నా డీసీఎం వ్యాన్ను ఆపలేదు. అలా ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత స్థానికులు గమనించి డీసీఎంను అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. క్లీనర్‌ను స్థానికులు పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

# ఖానాపూర్ మున్సిపాలిటీలో వీడిన ఉత్కంఠ బీఆర్ఎస్ సపోర్ట్‌తో ఛైర్మన్ పదవి బీజేపీ కైవసం




**ఖానాపూర్ :**రాష్ట్రంలో ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొన్ని పురపాలికల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఆదేశాలతో వాయిదా పడిన క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీ ల్లో ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించగా.. ఖానాపూర్‌లో తీవ్ర ఉద్రిక్తతల నడుమ మరోసారి ఇవాల్టికి ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. ఈ క్రమంలోనే ఎట్టకేలకు ఇవాళ ఖానాపూర్ మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించగా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో బీజేపీ పార్టీ గెలుచుకుంది. ఛైర్ పర్సన్‌గా బీజేపీకి చెందిన అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సోయల్ ఎన్నికయ్యారు.ఖానాపూర్ పురపాలక సంఘంలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. అందులో బీఆర్ఎస్ పార్టీ 4.. బీజేపీ 4.. కాంగ్రెస్ పార్టీ 3.. స్వతం త్రులు ఒక స్థానంలో గెలుపొ ందారు. కాంగ్రెస్ పార్టీకి స్వతం త్ర అభ్యర్థి మద్దతు తెలపడంతో పాటు.. ఎక్స్ అఫీషియో సభ్యుడి ఓటుతో.. ఆ పార్టీకి బలం ఐదుకు చేరింది. ఈ నేపథ్య ంలోనే ఏ పార్టీకి స్పష్టమైన మెజా ర్టీ లభించలేదు. ఈ క్రమంలోనే బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో.. ఈ రెండు పార్టీల బలం 8కి చేరింది. దీంతో బీజేపీ తరపున ఛైర్ పర్సన్ అభ్యర్థిగా ఉన్న అంకం మౌనికకు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ఏడుగురు అభ్యర్థులు సభ్యులు చేతులెత్తడంతో ఎన్నిక ముగిసింది. ఇక వైస్ ఛైర్ పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన సోయల్ విజయం సాధించారు.శనివారం ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన హైడ్రామా.. అధికారులతో జరిగిన వాగ్వాదంతో ఛైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా పడిన సంగతి తెలిసిందే. మున్సిపల్ ఛైర్మన్ ఎంపిక కోసం శనివారం సమావేశం నిర్వహించగా.. ఎన్నికైన సభ్యులు చేతులు ఎత్తే క్రమంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తమకు మద్దతుగా ఏడుగురు సభ్యులు మద్దతు తెలిపారని ఎక్స్ అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొనగా.

# ప్రైవేటుకు నై సర్కారుకు సై ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న బాలికల సంఖ్య

**కర్నూలు:** ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను పరిశీలించినా, విద్యార్థినుల సంఖ్య అధికంగానే కనిపిస్తోంది. ఓ వైపు విద్య పై సమాజంలో అవగాహన పెరుగుతోంది. మరోవైపు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల బాలికా విద్యకు ఇచ్చే ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో మరో ఆసక్తికరమైన అంశం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు కంటే బాలికల సంఖ్య గణనీయంగా ఉంది. ఫలితంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో బాలికల కంటే బాలురు సంఖ్య అధికంగా ఉంటుంది. ఇది మన సమాజంలో నెలకొని ఉన్న ఆర్థిక పరిస్థితులు, ఆలోచనలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రాథమిక స్థాయిలో బాలబాలికల మధ్య వ్యత్యాసం తక్కువగానే ఉన్నప్పటికీ ఉన్నత పాఠశాల స్థాయికి వెళ్లేసరికి ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు సంఖ్య, ప్రైవేటు బడుల్లో బాలుర సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఎయిడెడ్?లో కలిపి ఈ సంవత్సరం బాలికలు 17.34 లక్షల మంది చేరగా, కేవలం 15.47 లక్షల మంది బాలురు మాత్రమే చేరారు. దీనికి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో బాలుర సంఖ్య 19.81 లక్షల మంది ఉండగా, 15.59 లక్షల మంది బాలికలు చదువుతున్నారు. క్షేత్రస్థాయి



పర్యటనలో ఆసక్తికరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో అత్యధికంగా విద్యార్థినులు చదువుతున్నారు. ఒక్క ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో 3,323 మంది విద్యార్థులు ఉన్నారు. డోన్ బాలికల ఉన్నత పాఠశాలల్లో 1,137 ఉండగా, ఆదోని బాలికల ఉన్నత స్కూల్లో 1,724 మంది అమ్మాయిలు చదువుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా బాలికలు చదువుతున్న పాఠశాలగా ఎమ్మిగనూరు నిలిచింది. దీనికి సమీపంలోని బీసీ సంక్షేమ వసతి గృహం నుంచే సుమారు 500 మంది విద్యార్థినులు వస్తుండటం గమనార్హం. ప్రతి ఏడాది కొత్త ప్రవేశాలు 800 మందికి పైగా పొందుతున్నారు. ఏ తరగతి గదిని చూసినప్పటికీ విద్యార్థినులతో కిక్కిరిసి కనిపిస్తోంది. బాలికలకు ప్రత్యేకంగా ఉండడంతో తల్లిదండ్రులు ఇక్కడ ప్రవేశాలకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు. ఈ పాఠశాలలోను కూడా అనేక సమస్యలు విద్యార్థిలను వేధిస్తున్నాయి. విద్యార్థులు ఎదుర్కొంటున్నా సమస్యలు:-ఎమ్మిగనూరు బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉంది. దీంతో విద్యార్థినులు వరుసలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 50 సెక్షన్లకు గానూ ప్రతి సెక్షన్‌కు ఒక తరగతి చొప్పున 50 గదులు అవసరం అవుతుంది. కానీ ఇక్కడ ప్రస్తుతం 35 మాత్రమే అందుబా అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం వాటిని తరగతు లను చెట్ల కింద, వరండాలో నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ల్యాబ్?లు, లైబ్రరీల కోసం మరిన్ని గదులు కావాల్సి ఉంది. దీంతో ప్రస్తుతం వీటిల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. భోజనశాల, వంటలు చేసేందుకు ప్రత్యేక గదుల కొరత ఉంది. దీంతో పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బడులపైనే మక్కువ: ప్రభుత్వం ప్రత్యేకంగా బాలికల కోసం ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో వారికి హాస్టల్ సదుపాయం, అలాగే ప్రత్యేకంగా బాలికల కోసం సంక్షేమ వసతి గృహాలను కూడా ప్రవేశ పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బాలికల విద్య పట్ల అవగాహన క్రమంగా పెరుగుతోంది. ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తల్లిదం డ్రులను ఎంతోగానో ఆకటుకుంటున్నాయి. అన్ని సదుపాయాలతో ఆవాసాలకు సమీపంలోనే ప్రభుత్వ బడులు ఉండడం కూడా ఇందకు గల మరో కారణంగా చెప్పచ్చు. ఇప్పటికీ సురక్షితం కాదని కొందరూ భావిసున్నారు: ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంతమంది అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. బాలురును మాత్రం ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. అమ్మాయిలను వసతి గృహాల్లోనే ఉంచుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించడాన్ని ఇప్పటికీ సురక్షితం కాదని కొందరూ భావిస్తున్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో వారిని ఎంత చదివించినా పెళ్లి చేసి, పంపించాలి అనే దృక్పథం నేటికీ కొనసాగుతోంది. ప్రాథమిక స్థాయిలో ఫీజులు తక్కువగా ఉండటం వల్ల కొంతమంది బాలికలను ప్రైవేటు బడుల్లో జాయిన్ చేయిస్తున్నారు. తర్వాత అధిక ఫీజులతో ప్రభుత్వ ఉస్కూళ్లల్లోనే అమ్మాయిలను చేర్పిస్తున్నారు.

## జగన్‌ను చూస్తే తుగ్లక్ గుర్తొస్తున్నారు: మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి, ఏప్రిల్ 5:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి కొలుసు పార్థసారథి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తుగ్లక్ పేరు వినడం తప్ప.. చూడలేదని, జగన్‌ను చూస్తే తుగ్లక్ గుర్తొస్తున్నారని అన్నారు. ప్రజలు జగన్ తీరు చూసే ఎన్నికల్లో ఆ తీర్పు ఇచ్చారని చెప్పారు. 3 రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారంటూ మండిపడ్డారు. తాను చెప్పింది అందరూ వినాలనే ధోరణిలో జగన్ ఉన్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై ప్రజలకు అపార నమ్మకం ఉందని పేర్కొన్నారు. మంత్రి పార్థసారథి ఆదివారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి స్వచ్ఛందంగా భూములిచ్చారు. రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా?. రాబోయే రోజుల్లో వైసీపీకి పుట్టగతులు లేకుండా చేస్తారు' అని అన్నారు. ఆ మాట పలకడానికి జగన్ అనర్హుడవైసీపీ అధినేత జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'తెలుగు జాతి, అమరావతిపై జగన్‌కి ఎందుకంత కక్ష? అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు.. అమరావతికి వ్యతిరేకం కాదన్నారు. అధికారంలోకి రాగానే 3 రాజధానులు అంటూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లో ఆగిపోయిన రాజధాని పనులన్నింటినీ ప్రారంభించాం' అని అన్నారు.

## ఏపీ తీర ప్రాంతంలో చేపల అక్రమ వేట.. తమిళనాడు బోట్లపై ఏపీ ప్రభుత్వం ఆగ్రహం

**నెల్లూరు:** ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో తమిళనాడు బోట్లు తిరగడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ అయినట్లు గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఏపీ తీర ప్రాంతంలోని బంగాళాఖాతంలోకి ఆ రాష్ట్ర బోట్లు అక్రమంగా చొరబడి చేపల వేట చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు తమిళనాడు బోట్లను ఎదుర్కొనేందుకు టాస్క్ ఫోర్స్‌ను రంగంలోకి దింపినట్లు మంత్రి వెల్లడించారు. మన రాష్ట్ర మత్స్య సంపదను తమిళనాడు మత్స్యకారులు కొల్లగొడుతున్నారని.. అందుకే ఆధునిక స్పీడ్ బోట్ల సహాయంతో టాస్క్ ఫోర్స్ గస్తీ కాస్తోందని పేర్కొన్నారు. మెరైన్ బోట్లు ద్వారా చేపల అక్రమ వేటకు అడ్డుకట్ట వేసేందుకు సీఎం చంద్రబాబు సర్కార్ చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు తెచ్చి మరీ ఏపీ మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై ప్రతిపక్షం లేనిపోని ఆరోపణలు చేస్తూ అనుమానాలు సృష్టిస్తోందని మంత్రి కొల్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జువ్వలదిన్నె హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్‌కి 7.5 ఎకరాలు మాత్రమే



ఏపీ ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. పులికాట్‌లో పూడిక తొలగించేం దుకు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. కృష్ణపట్నం పోర్ట్ వద్ద జెట్టీల ఏర్పాటుకూ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఏపీ తీరంలో తమిళనాడు, పాండిచ్చేరి బోట్ల ఆగడాలు, అక్రమ చేపల వేటని అస్సలు ఊపేక్షించవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని మెరైన్ ఐజీ గోపీనాథ్ తెలిపారు. దీంతో తీరంలో 24గంటలూ గస్తీ ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 4 బోట్లలో టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మర గస్తీ కాస్తున్నట్లు ఆయన తెలిపారు. మరో 4 బోట్లు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఐజీ వెల్లడించారు. ఇటీవల కాలంలో మూడు ఇతర రాష్ట్రాల బోట్లని టాస్క్ ఫోర్స్ బృందాలు పట్టుకున్నట్లు తెలిపారు.

## నామమాత్రపు వేతనాలతో పనిచేయించుకోవడం 'శ్రమ దోపిడీయే' - ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు


: ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు హైకోర్టు తీపికబురు చెప్పింది. అదే సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అనుసరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మంజూరైన పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకపోవడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, తాత్కాలిక పద్ధతిలో విద్యావంతులైన యువతను కారుచౌకగా నియమించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నామమాత్రపు జీతాలు ఇస్తూ వారి చేత పనిచేయించుకోవడం ముమ్మాటికీ 'శ్రమ దోపిడీ' కిందకే వస్తుందని ఈ మేరకు హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ ఉద్యోగుల సర్వీసులను తక్షణమే క్రమబద్ధీకరించాలని (రెగ్యులరైజ్) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కీలక తీర్పునకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శాశ్వత పోస్టుల్లో తాత్కాలిక నియామకాలా : వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగుల నియామకాలపై హైకోర్టు



కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రభుత్వంలో అనేక పోస్టులు మంజూరై ఉన్నాయి. ఆ ఖాళీలను ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలి. కానీ, ప్రభుత్వం అలా చేయడం లేదు. శాశ్వత ఉద్యోగుల స్థానంలో తాత్కాలిక, పొరుగు సేవలు (ఔట్ సోర్సింగ్), ఒప్పంద (కాంట్రాక్ట్) ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకుంటోంది. ఇలా తాత్కాలికంగా తీసుకున్న ఉద్యోగుల చేత దశాబ్దాలుగా వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ఘటనలు తమ దృష్టికి వస్తున్నాయి" అని న్యాయస్థానం ఆవేదన వ్యక్తం చేసింది. విద్యావంతులకు తీరని అన్యాయం : ఉన్నత చదువులు చదివిన యువతకు ప్రభుత్వం తక్కువ వేతనం చెల్లించడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యావంతులకు నామమాత్రపు వేతనాలు ఇవ్వడం దారుణమని వ్యాఖ్యానించింది. సంవత్సరాల తరబడి పనిచేస్తున్న వారు, తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరితే ప్రభుత్వం రకరకాల సాకులు చెబుతోందని ఆక్షేపించింది. ఏళ్లు గడుస్తున్నా వారిని ఇంకా రోజువారీ వేతన ఉద్యోగులుగా చూడటాన్ని తప్పుబట్టింది. "ఏదో ఒకరోజు తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుంది, తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయి" అని ఆ తాత్కాలిక ఉద్యోగులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారని కోర్టు సానుభూతి వ్యక్తం చేసింది. ఒక సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం ఓ ఆదర్శవంతమైన యజమానిలా వ్యవహరించాలని, ఇలా శ్రమ దోపిడీకి పాల్పడే తీరు ఏమాత్రం సరికాదని స్పష్టం చేసింది. రెండు నెలల్లోగా రెగ్యులరైజ్ చేయాల్సిందే! : ఈ కేసు విచారణ అనంతరం హైకోర్టు కీలక తీర్పును వెలువరించిన సామంతలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. ఉద్యోగులసర్వీసును క్రమబద్ధీకరించడానికి నిరాకరిస్తూ గతంలో ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ ఒక ఉత్తర్వు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం పూర్తిగా రద్దు చేసింది. పిటిషనర్లుగా ఉన్న తాత్కాలిక ఉద్యోగులందరి సర్వీసులను కేవలం రెండు నెలల (60 రోజులు) వ్యవధిలో క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కచ్చితమైన ఆదేశా లు జారీ చేసింది. ఈ తీర్పుతో లబ్ధి పొందేది వీరే : హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో పలువురు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయి. ప్రధానంగా ఈ కింది విభాగాల్లో పనిచేస్తున్న వారికి ప్రయోజనం దక్కనుంది. తెలుగు గంగ ప్రాజెక్ట్?లో దశాబ్దాలుగా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, టైపిస్టులు, ఇతర కేడర్ల ఉద్యోగులు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్?లో పనిచేస్తున్న టైపిస్టులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు సబార్డినేట్లు, ట్రేసర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు తదితర తాత్కాలిక సిబ్బందికి ఈ తీర్పుతో శాశ్వత ఉద్యోగ హోదా దక్కనుంది.

## మాచర్ల పరువు హత్య కేసులో సీఐ సస్పెండ్ యువతిని పేరెంట్స్‌కు అప్పగించేందుకు లంచం

**పల్నాడు జిల్లా** మాచర్ల పట్టణంలో జరిగిన పరువు హత్య కేసులో సంచలనవిషయాలు బయటికి వస్తున్నాయి. పెళ్లి కుదిర్చిన తర్వాత.. ప్రేమించిన వాడి కోసం తన కుమార్తె పారిపోయి ప్రేమ పెళ్లి చేసుకోవడాన్ని తట్టుకోలేని ఓ తండ్రి.. పోలీసులకు ఫిర్యాదు చేసి.. తన కుమార్తెను వెనక్కి తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకుందని పేర్కొనగా.. పోస్టుమార్టంలో హత్యగా తేలింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు జరిపిన పోలీసులు.. తండ్రే హంతకుడు అని.. ప్రేమ పెళ్లి చేసుకోవడం తట్టుకోలేక పరువు హత్యకు పాల్పడ్డాడని గుర్తించారు. అయితే ప్రేమ పెళ్లి చేసుకున్న యువతిని. తిరిగి తల్లిదండ్రులకు అప్పగించేందుకు మాచర్ల టౌన్ సీఐ.. ఆమె తండ్రి వద్ద లంచం తీసుకున్నారని ఆరోపణలు రాగా.. విచారణ జరిపి ఉన్నతాధికారులు అతడిపై




సస్పెన్షన్ వేటు వేశారు. మాచర్లకు చెందిన చంద్రశీను, గంగ దంపతుల కుమార్తె అయిన చౌడేశ్వరి.. జమ్మలమడకకు చెందిన నాగరాజును ప్రేమించింది. ఈ క్రమంలోనే వారి ప్రేమను అంగీకరించని.. చంద్రశీను తన కుమార్తెకు వేరే వ్యక్తితో పెళ్లి చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇక చౌడేశ్వరి నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేయగా.. ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక ఆమె ఇంటి నుంచి పారిపోయింది. ఆ తర్వాత ప్రియుడు నాగరాజును పెళ్లి చేసుకుంది. అయితే అది నచ్చని చంద్రశీను.. తన కుమార్తె చౌడేశ్వరి తన ఇంట్లో నుంచి బంగారం, నగదు తీసుకుని పారిపోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నాగరాజు, చౌడేశ్వరి ఆచూకీని గుర్తించిన పోలీసులు. వారిని చంద్రశీనుకు అప్పగించారు. అయితే తన కుమార్తెను తనకు అప్పగిస్తే.. లంచంగా భారీగా డబ్బులు ఇస్తానని మాచర్ల సీఐ వెంకటరమణతో చంద్రశీను బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. లంచం కోసం సీఐ వెంకటరమణ.. చౌడేశ్వరిని బలవంతంగా తల్లిదండ్రులకు అప్పగించాడని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల 18వ తేదీన చంద్ర శీను.. అతడి మేనల్లుడు పచ్చిపాల శీను కలిసి.. నిద్రపోతున్న చౌడేశ్వరిని దిండుతో ఊపిరి ఆడకుండా చేసి హతమార్చారు.

ఆ తర్వాత చౌడేశ్వరి ఆత్మహత్య చేసుకుందని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేశారు. చివరికి పోలీసులు చౌడేశ్వరి మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించగా.. ఆమెను హత్య చేసినట్లు తేలింది. దీంతో పరువు కోసం ఆమె తండ్రే ఈ హత్య చేశాడని గుర్తించారు. అయితే ఈ పరువు హత్యలో సీఐ వెంకటరమణ పాత్ర ఉందని.. లంచం తీసుకుని ఆమెను తండ్రికి అప్పగించారనే ఆరోపణలు రావడంతో అతడి హస్తం కూడా ఉందని గుర్తించిన పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు సీఐ వెంకటరమణను సస్పెండ్ చేస్తూ.. తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.


## టెర్రర్ లింక్స్ కేసు.. కేసులో బలం లేదన్న నిందితుల తరఫు న్యాయవాది..

**అమరావతి, ఏప్రిల్ 5:** ఉగ్రవాద సంస్థలకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు విజయవాడకు చెందిన రెహ్మతుల్లా షరీఫ్, డానిష్, సొహైల్ బేగ్.. హైదరాబాద్‌కు చెందిన సయిదా బేగం.. బళ్లారికి చెందిన అబ్దుల్ సలాంలను కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ ఈ రోజు (ఆదివారం)తో ముగుస్తుంది. ఐదవ రోజు కస్టడీలో భాగంగా ఏటీఎస్, ఎన్ఐఏ ఇంటెలిజెన్స్ అధికారులు టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఐదుగురిని విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిందితుల తరఫు న్యాయవాది సలీం మాట్లాడుతూ.. 'ఈ రోజుతో ఐదుగురి కస్టడీ ముగుస్తుంది. టెర్రర్ లింక్స్ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతుంది. కేసులో ఎటువంటి బలం లేదు. పోలీసులు ఫారిన్ హ్యాండ్లర్ గురించి కూడా



విచారిస్తున్నారు. అరెస్టయిన వాళ్లంతా నిరుపేదలు. వాళ్లు టెర్రరిజం వైపు వెళ్లాలని అనుకోలేదు. రాడికల్ భావజాలానికి మాత్రమే ఆకర్షితులయ్యారు. కేరళలో ఐఎస్ఐఎస్ జెండాలు ఉన్న టీ షర్ట్ వేసుకున్న కేసులో నిందితులను నిర్దోషులుగా తేల్చి విడుదల చేశారు. ఈ కేసులో వీళ్లు పోస్టులు మాత్రమే పెట్టారు. ఎటువంటి దేశ వ్యతిరేక చర్యలకు దిగలేదు' అని అన్నారు.

## అల్లూరి జిల్లాలో భూకంపం.. భయంతో పరుగులు తీసిన జనం



**అమరావతి :** ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో భూకంపం () వచ్చింది. శనివారం రాత్రి 11:30 గంటలకు అరకు వ్యాలీ, పాడేరు, పెదబయలు, హుకుంపేట , ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 4.4గా నమోదైంది. . దీని ప్రభావంతో విశాఖపట్నంలోని స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఎన్నడూలేని విధంగా ఒక్కసారిగా భూమి కంపించడంతో భయాందోళనకు గురయ్యామని, భయంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశామనిస్థానికులు చెబుతున్నారు. కాగా, అరకు--పాడేరు ప్రాంతం సిస్మిక్ జోన్ పరిధిలో ఉండటంతో ఇలాంటి ప్రకంపనలు అప్పుడప్పుడు సహజమేనని నిపుణులు చెబుతున్నారు.

## మావిగన్‌పై అంత ప్రేముంటే.. సీఆర్డీఏను ఎందుకు రద్దు చేయాలనుకున్నారు జగన్

**అమరావతి, ఏప్రిల్ 05:** మావిగన్ పేరు ప్రతిపాదనతో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కామెడీ పీస్‌గా మారిపోయారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ వ్యంగంగా అన్నారు. ఆదివారం అమరావతిలో కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఏపీ సీఆర్డీఏ మ్యాప్ చూస్తే.. సీఎం చంద్రబాబు నాయుడి విజన్ ఏమిటో జగన్ రెడ్డికి అర్థమవుతుందన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి అనుకూలంగా ఉంటే.. వైఎస్ జగన్ ఒక్కరే వ్యతిరేకంగా ఉన్నారని గుర్తు చేశారు. అమరావతిపై ఉన్న కడుపు మంటతోనే జగన్ మావిగన్ పేరు ప్రతిపాదన చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కోరిక మేరకు అమరావతి



తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో రూపొందించిన చట్టాలు.. రాష్ట్రాలకు మార్చే హక్కు లేదని వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బిల్లు, తీర్మానానికి గల వ్యత్యాసాన్ని తెలుసుకోవాలంటూ వైఎస్ జగన్‌కు ఆయన సూచించారు. జగన్ కుట్రలను గ్రహించాలని రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా పట్టాభిరామ్ స్పష్టం చేశారు. అభివృద్ధి పాఠాలు జగన్ దగ్గర నేర్చుకోవాల్సిన పని కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. 2014లోనే కృష్ణా, గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం అభివృద్ధికి చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారని వివరించారు. 2015 సెప్టెంబర్ 22వ తేదీన అందుకు సంబంధించిన జీవో నెం.207 ద్వారా సీఆర్డీఏ చట్టం రూపొందించి ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రణాళికలు రచించారని గుర్తు చేశారు.

# ‘ధర్మదామ్’లో ఎన్నికల హీట్- హ్యాట్రిక్‌పై సీఎం విజయన్ గురి- ఈసారి కష్టపడాల్సిందేనా

కేరళం అసెంబ్లీ ఎన్నికల వేళ అందరి దృష్టి ‘ధర్మదామ్’ నియోజకవర్గంపైనే నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ మూడోసారి ఇక్కడి నుంచి పోటీలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో 2016, 2021లో ఈ స్థానంలో పోటీ చేసి గెలిచిన ఆయన మూడోసారి విజయఢంకా మోగించి నయా చరిత్ర సృష్టించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ధర్మదామ్ విశేషం ఏంటి? విజయన్ ప్రత్యర్థులెవరు ఎవరి అవకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం!వామపక్షాల కంచుకోట !2008లో ధర్మదామ్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. ఇది కేరళలోని కన్నూర్ జిల్లాలో ఉంది. ఈ నియోజరవర్గంలో ఎనిమిది పంచాయతీలు ఉన్నాయి. 2011లో ఈ స్థానానికి తొలిసారి ఎన్నికలు జరగ్గా, అప్పుడు ఎల్‌డీఎఫ్ (లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థి కేకే నారాయణన్ గెలుపొందారు. అప్పటి నుంచి ధర్మదామ్‌కు మూడుసార్లు ఎన్నికలు జరగ్గా మూడునెర్లు కూడా లెఫ్ట్ పార్టీనే విజయం సాధించింది. యూడీఎఫ్ (యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఇక్కడ ఒక్కసారి కూడా



నెగ్గలేకపోయింది. అలా గత 15ఏళ్లుగా ఈ నియోజకవర్గం లెఫ్ట్ వింగ్ పార్టీలకు కంచుకోటగా నిలుస్తోంది. హ్యాట్రిక్‌పై గురి!2016లో విజయన్ ఈ స్థానంలో ఎల్‌డీఎఫ్? తరపున తొలిసారి పోటీ చేశారు. అప్పుడు తన ప్రత్యర్థి మంబారమ్ దివాకరణ్ (కాంగ్రెస్)పై 36 వేలకు పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. ఇక రెండోసారి 2021లో పోటీ చేసిన విజయన్ బంపర్ మెజార్టీలో జయకేతనం ఎగురవేశారు. ఈసారి సీ రఘునాథ్ (కాంగ్రెస్)పై 50వేలకుపై మెజార్టీతో నెగ్గారు. ఇప్పుడు మరోసారి ఇక్కడ్నుంచే పోటీలో నిలిచిన ఆయన హ్యాట్రిక్?పై కన్నేశారు. ఈ నియోజకవర్గం లెఫ్ట్ పార్టీలకు కంచుకోటగా ఉండడం ఎల్?డీఎఫ్?కు సానుకూలాంశం. అలాగే గత చరిత్ర వామపక్షాలకు అనుకూలంగా ఉండడం, విజయన్ స్వయంగా సీఎం అభ్యర్థి కావడం కూడా కలిసొచ్చేదే. ఇక గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన సంక్షేమం, ఇప్పుడు కొత్తగా మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలే ప్రధానంగా అధికార ఎల్‌డీఎఫ్ ముందుకెళ్తోంది. ఇక దేశంలో సీపీఐ (మార్క్సిస్ట్)లో అత్యంత ప్రభావితమైన నాయకులలో ఒకరిగా పేరున్న విజయన్ పనితీరుకు ఈ నియోజకవర్గం ఫలితాన్ని ఒక కొలమానంగా రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు! ప్రత్యర్థుల ఆశలు!సీఎం విజయన్‌ను ఢీ కొట్టేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ నుంచి వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలిచారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్, స్థానికంగా ఉన్న సమస్యలు, యువత నిరుద్యోగం అనే అంశాలపై ఆశలు పెట్టుకుంది. మరోవైపు, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కే రంజిత్‌ను తమ అభ్యర్థిగా ఖరారు చేసింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అనే నినాదాన్ని ఎన్‌డీఏ ముందుకు తీసుకువెళ్తోంది. అయితే ధర్మదామ్ అనగానే ఎల్‌డీఎఫ్- యూడీఎఫ్ మధ్య పోటీనే ఉండేది. కానీ ఈసారి బీజేపీ రేస్‌లోకి దూసుకొచ్చింది. ఇటీవల తిరువనంతపురం కార్పోరేషన్ ఎన్నికల్లో నెగ్గడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ తొలిసారి ఎంపీ సీటు కైవసం చేసుకోవడంతో బీజేబీ కూడా ఈ స్థానంపై ఆశలు పెట్టుకుంది. ఆ పార్టీ వరుసగా మూడు ఎన్నికల్లో ఓటు శాతం పెంచుకుంటూ వస్తోంది. ఈసారి ఎలాగైనా నెగ్గాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం జాతీయ స్థాయి నాయకులు ఇప్పటికే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక ఈసారి ఎలాగైనా ఎల్‌డీఎఫ్‌ను దెబ్బ కొట్టి ధర్మదామ్‌లో తమకూ స్థానం ఉందని చూపించాలని యూడీఎఫ్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ పరిణామాలు చూస్తుంటే, గతంలో కంటే పోటీ ఇప్పుడు భిన్నంగా ఉండనుందని అర్థమవుతోంది. ఇక్కడి నుంచి విజయన్ రెండుసార్లు ఈజీగా నెగ్గినప్పటికీ ఈసారి ఈసారి త్రిముఖ పోటీ ఉందనడంలో సందేహం లేదు. శబరిమల బంగారం అంశం, మైనారిటీల ఓటు బ్యాంక్ కీలకం కానుంది.

# రాఘవ్ చద్దాను రహస్య భవనంలో కొట్టారు



ఆమ్ ఆద్మీ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు తారస్థాయికి చేరుకున్నాయి. పార్టీ ఎంపీ రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించిన నాటి నుండి మొదలైన ఈ వివాదం, ఇప్పుడు వసూళ్లు, భౌతిక దాడుల ఆరోపణల వరకు వెళ్లింది. తాజాగా ఆప్ హర్యానా మాజీ అధ్యక్షుడు నవీన్ జైహింద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. రాఘవ్ చద్దాను ఢిల్లీ, చండీగఢ్‌లోని ఒక ‘రహస్య భవనం’లో బంధించి కొట్టారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కేజ్రీవాల్ ‘రాజ్‌దార్’.. వసూళ్ల డబ్బంతా లండన్‌కు? రాఘవ్ చద్దాను అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తుడైన ‘రాజ్‌దార్’ (రహస్యాలు తెలిసిన వాడు), ‘మాల్‌దార్’ (డబ్బున్న వాడు) అని నవీన్ జైహింద్ చెప్పుకొచ్చారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల నుండి భారీ మొత్తంలో వసూలు చేసిన డబ్బు చుట్టూనే ఈ వివాదం అంతా తిరుగుతోందని ఆయన పేర్కొన్నారు. నిజానికి ఆ డబ్బును సింగపూర్‌కు తరలించాల్సి ఉందని.. కానీ రాఘవ్ చద్దా ఆ సొమ్మును ఇంగ్లాండ్‌కు తీసుకెళ్లారని.. ఇదే ఇప్పుడు పార్టీలో పెద్ద గొడవకు కారణం అయిందని జైహింద్ ఆరోపించారు. ఈ డబ్బు వ్యవహారంలో విభేదాలు రావడంతో రాఘవ్ చద్దాపై భౌతిక దాడులు జరిగాయని జైహింద్ పేర్కొన్నారు. మొదట ఢిల్లీలో, ఆ తర్వాత చండీగఢ్‌లోని ఒక రహస్య భవనంలో రాఘవ్ చద్దాను కోడి పుంజులా నిలబెట్టి కొట్టారు. ఇదంతా కేవలం అవినీతి, డబ్బు పంపకాలకు సంబంధించిన గొడవ తప్ప మరొకటి కాదని ఆయన ఘాటుగా విమర్శించారు. అయితే ఈ ‘వసూళ్ల’ ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటి వరకు స్పందించలేదు. మరోవైపు తనను పదవి నుంచి తొలగించడంపై రాఘవ్ చద్దా మౌనం వీడారు. తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఒక కోఆర్డినేటెడ్ అటాక్‌గా అభివర్ణించారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజమని నమ్మే ప్రమాదం ఉందని, స్పందిస్తున్నాను అని చెప్పుకొచ్చారు.

# అమెరికా వైమానిక దాడుల్లో ఇరాన్ సైనిక నేతలు మృతి



**అమెరికా,:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా భారీ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన మిలిటరీ అగ్రనేతలు చాలా మంది మరణించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ప్రకటన చేశారు. “టెహ్రాన్‌పై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సైన్యాన్ని బలహీనంగా, తెలివితక్కువగా నడిపించిన చాలా మంది ఆ దేశ సైనిక లీడర్లు చాలా మంది హతమయ్యారు” అని ట్రంప్ ప్రకటించారు. దీనికి సంబంధించి కొన్ని వీడియోల్ని కూడా ట్రంప్ విడుదల చేశారు. అయితే, మరణించిన మిలిటరీ లీడర్ల వివరాల్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పందనా లేదు. మరోవైపు ట్రంప్.. హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్‌కు హెచ్చరిక జారీ చేశారు. 48 గంటల్లోగా జలసంధిని తెరవాలని అల్టిమేటమ్ ఇచ్చారు. లేకుంటే ఇరాన్‌పై విరుచుకుపడుతామని ట్రంప్ అన్నారు. ఈ వార్నింగ్ అనంతరం ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగింది. మరోవైపు తమ పైలట్‌ను కాపాడుకునేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఇరాన్‌లో చిక్కుకున్న పైలట్‌ను అమెరికా రక్షించుకుంది. ఇంకోవైపు ఇరాన్ కూడా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కువైట్‌పై దాడి చేసింది. కువైట్‌లోని షువైఖ్ ఆయిల్ సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ డ్రోన్లో విరుచుకుపడింది.

# పుదుచ్చేరికి రాష్ట్ర హోదా- పేదలకు ఉచిత విద్యుత్ విజయ్ హామీల వెల్లువ

**పుదుచ్చేరి:** పుదుచ్చేరికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను సాధించడానికి నూటికి నూరు శాతం కృషి చేస్తామని టీవీకే అధినేత విజయ్ హామీ ఇచ్చారు. కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించలేదని విజయ్ గుర్తు చేశారు. పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన విజయ్, డీఎంకే-కాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. తమిళనాడు మాదిరిగానే పుదుచ్చేరిలోనూ అది ఒక గందరగోళ కూటమిగా మారిందంటూ ఎద్దేవా చేశారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పుదుచ్చేరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని విజయ్ వాగ్ధానం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ కుటుంబానికి 25లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని వివరించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెన్స్ అండ్ ఆర్ట్స్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, ప్రత్యర్థి కూటములపై విజయ్? తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడులో ఉన్న పరిస్థితులే



పుదుచ్చేరిలోనూ కొనసాగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.”పుదుచ్చేరిలో రెండు ప్రధాన కూటములు ఉన్నాయి. కానీ ప్రజల సమస్యలకు అవి సరైన పరిష్కారం చూపలేకపోతున్నాయి. డీఎంకే-కాంగ్రెస్ కూటమి గందరగోళంలో ఉంది. మరోవైపు ఎన్?ఆర్ కాంగ్రెస్?, బీజేపీ కూటమి అలసిపోయింది. ఈ రెండు కూటములకు ఓటు వేయడం వృథా. పుదుచ్చేరికి సుపరిపాలన అవసరం.”- విజయ్?, టీవీకే అధినేతప్రజలకు మంచి పాలన అందించడమే లక్ష్యం!మరోవైపు, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా గురించి కూడా విజయ్? ప్రస్తావించారు. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని గతంలో ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ, కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీలు ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విజయ్? ప్రశ్నించారు. అయితే, టీవీకే అధికారంలోకి వస్తే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధించేందుకు కృషి చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని తమ ఎన్నికల ప్రధాన అజెండాగా తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎన్నికల్లో తాను మొదటి సారిగా పోటీ చేస్తున్నట్లు విజయ్? గుర్తు చేశారు. అయితే ప్రజలకు మంచి పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలకు కొత్త ప్రత్యామ్నాయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తాము అధికారంలోకి వస్తే అవినీతి రహిత పరిపాలనను అందిస్తామని విజయ్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, పుదుచ్చేరి శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో తమిళగ వెట్రి కజగం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తోంది. పుదుచ్చేరి ఎన్నికల సమరంపుదుచ్చేరి 30 స్థానాలకు గానూ ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ, గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పోటీ పడుతున్నాయి. కాగా, ప్రస్తుత అసెంబ్లీ గడువు జూన్ 15తో ముగియనుంది. ఇదిలా ఉండగా, పుదుచ్చేరిలో చివరిసారిగా 2021లో ఎన్నికలు జరిగాయి. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎన్ఆర్?సీ 10 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 6 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. అలాగే, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తలో 6 స్థానాలు గెలుచుకున్నాయి. ఆ ఎన్నికల్లో పోలింగ్ శాతం 84.8గా నమోదైంది. అంతకుముందు 2016 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చింది. ఏఐఎన్ఆర్‌సీ 8 స్థానాలు, ఏఐఏడీఎంకే 4 స్థానాలు, డీఎంకే 2 స్థానాలు గెలుచుకున్నాయి. అప్పటి ఎన్నికల్లో ఓటింగ్ శాతం 83.6గా నమోదైంది.

# అస్సాం, బెంగాల్‌లో బీజేపీదే గెలుపు.. గడ్కరి ధీమా

**న్యూఢిల్లీ:** త్వరలో జరుగనున్న అస్సాం, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. సమ్మిళిత అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, మత పరమైన ఏ గ్రూపులకు వ్యతిరేకం కాదని చెప్పారు. మైనారిటీలు, ఎస్ఐఆర్‌పై. .మైనారిటీలు, ఎస్ఐఆర్‌పై కేంద్రంలోని బీజేపీ వైఖరిపై ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, సమ్మిళిత అభివృద్ధే బీజేపీ విధానమని అన్నారు. ప్రగతి, ఐక్యతకు కట్టుబడి పార్టీ పనిచేస్తోందని, మతపరమైన ఏ గ్రూపులకు వ్యతిరేకం కాదని చెప్పారు. ఎస్ఐఆర్ వంటి అంశాల విషయంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటుందని తెలిపారు. ‘అటు అస్సాం, అటు బెంగాల్‌లో మేము గెలుస్తామనే గట్టి నమ్మకం నాకుంది. ఏదో ఒక మతాన్ని కాకుండా అందర్నీ కలుపుకుని వెళ్లడమే బీజేపీ విధానం.



చొరబాటుదారులను మేము వ్యతిరేకి స్తామే కానీ ముస్లింలకు వ్యతిరేకం కాదు’ అని గడ్కరి వివరణ ఇచ్చారు. పార్టీ ఎన్నికల ప్రచా రంలో అభివృద్ధి అనేదే ప్రధాన అంశమని, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధికి కట్టుబడి పార్టీ పనిచేస్తోందని గడ్కరి చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో ప్రధానంగా పెట్టుబడులు పెడుతున్నామని, మరిన్ని ప్రాజెక్టులకు కూడా ప్లానింగ్ చేస్తున్నామని తెలిపారు. అస్సాం సహా ఈశాన్య ప్రాంతాల్లో రూ.5 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని, రూ.1.5 లక్షల కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో రూ.1.5 నుంచి రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయని, అదనంలో మరో రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, హైవేలు, లాజిస్టిక్ వంటి సదుపాయాలతో కెనెక్టివిటీ పెరిగి, ఆయా ప్రాంతాలు ఆర్థికంగా బలపడతాయని అన్నారు. ఈశాన్య ప్రాంతాలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇదే పరిష్కారమని అన్నారు. చొరబాట్లపై..అక్రమ చొరబాట్లకు తమ పార్టీ వ్యతిరేకమని, ఏ నిర్దిష్ట మతానికి కాదని గడ్కరి స్పష్టం చేశారు. అక్రమ చొరబాట్లను అడ్డుకోకుంటే దేశం ఒక ధర్మశాలగా మారుతుందని గడ్కరి హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌లో రాజకీయ మార్పు కోరుతూ ప్రజల నుంచి మద్దతు పెరుగుతోందని చెప్పారు. ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియపై బెంగాల్ ముఖమంత్రి మమతా బెనర్జీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ, జాతీయ ప్రయోజనాలే బీజేపీకి ముఖ్యమని అన్నారు. జాతీయ ప్రయోజనాల విషయంలో తాము రాజకీయాలు చేయమని, ఆయా అంశాలను (ఎస్ఐఆర్ వంటి అంశాలు) కేవలం జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే చేపడుతున్నామని చెప్పారు.

# యుద్ధంవల్ల అమెరికా ప్రాధాన్యతలు మారుతున్నాయి

**అమెరికా :** పశ్చిమాసియా లో యుద్ధంవల్ల అమెరికా ప్రాధాన్యతలు మారుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇన్నాళ్లు తమకు అమెరికా నుంచి అందిన సైనిక, ఆయుధ సరఫరాను ఆ యుద్ధం కారణంగా తగ్గించి, వాటిని ఇజ్రాయెల్ కు మళ్లిస్తున్నారని వ్యాఖ్యాని ంచారు. ఈ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే అగ్రరాజ్యం నుంచి తమకు వస్తున్న మద్దతు భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. రష్యా ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడానికి ఇన్నాళ్లు తాము అమెరికా సరఫరా చేసే పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించామని జెలెన్‌స్కీ చెప్పారు. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో యుద్ధంలో తీవ్రంగా నష్టపోతున్నామని



అన్నారు. తమ ఆయుధ నిల్వలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని జెలెన్‌స్కీ వాపోయారు. కొద్దికాలంగా అమెరికా మద్దతు తగ్గుతుండటంతో స్వదేశీ డ్రోన్ల తయారీని పెంచామని చెప్పారు. కాగా డ్రోన్‌లు, క్షిపణుల ఉత్పత్తికి అంతరాయం కలిగించడానికి రష్యా తమ ఇంధన నిల్వలను టార్గెట్ చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు.

# ప్రియుడి సహాయంతో భర్తను చంపించిన భార్య.. ముగ్గురు అరెస్ట్

లక్నో: ఒక మహిళ ఆమె ప్రియుడి మధ్య ఉన్న సంబంధం గురించి భర్తకు తెలిసింది. ఈ నేపథ్యంలో అతడ్ని హత్య చేసేందుకు ప్రియుడికి ఆమె సహకరించింది. సగం కాలిన వ్యక్తి మృతదేహంపై దర్యాప్తు చేసిన పోలీసులు ఆ మహిళతో సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 1న ఆగ్రాలోని సయ్యాన్ ప్రాంతంలో సగం కాలిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచా రం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. అయితే ముఖం గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో మృతదేహాన్ని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ముంజేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా హతుడి పేరు లోకేంద్ర అని తెలుసుకున్నారు. మరునాడు అతడి అదృశ్యంపై లోకేంద్ర సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేంద్ర ప్రజాపతితో కలిసి చివరిసారి అతడు కనిపించినట్లు పేర్కొన్నాడు.



కాగా, లోకేంద్ర హత్య కేసు ఛేదించేందుకు ఐదు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. నేర స్థలం సమీపంలో పడి ఉన్న మద్యం సీసాలు, కొన్ని కాగితపు ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఒక పండ్ల వ్యాపారి వినియోగదారుల కోసం ఆ కాగితపు ముక్కలు ఉపయోగిస్తాడని ఆ ప్రాంతంలోని షాపుల వ్యక్తులు పోలీసులకు చెప్పారు. మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా వాటిని ఎక్కడ కొనుగోలు చేశారో తెలుసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ల ద్వారా నిందితులను గుర్తించారు.

# అస్సాం ఎన్నికల్లో బీఫ్ గొడవ: జెన్-జీ అభ్యర్థిపై హిమంత శర్మ నిప్పులు

**అస్సాం :** అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నా కొద్దీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ముఖ్యంగా బీఫ్ వినియోగానికి సంబంధించిన వివాదం ఇప్పుడు అధికార బీజేపీ, ప్రతిపక్ష అస్సాం జాతీయ పరిషత్ (ఏజేపీ) గొడవకు కారణం అయింది. సెంట్రల్ గువహటి ఏజేపి అభ్యర్థి కుంకి చౌదరి, ఆమె తల్లి సుజాత గురుంగ్ చౌదరి లక్ష్యంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్ర విమర్శలు చేశారు. అస్సాం సంస్కృతిలో గోమాంస భక్షణకు తావులేదని స్పష్టం చేశారు. అసలేమిటీ గొడవంటే..?కుంకీ చౌదరి తల్లి పాకిస్థాన్‌కు మద్దతు తెలుపుతూ.. సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారని సీఎం హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. సనాతన భావాలు ఉన్న పరజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. అంతేకాకుండా చౌదరి తల్లి బీఫ్ వినియోగానికి సంబంధించి కూడా అనేక పోస్టులు షేర్ చేశారని.. కొన్ని





వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యానించారని అన్నారు. “కుంకీ చౌదరి తల్లి సుజాత గురుంగ్ చౌదరి. ఆమె సిక్కింకు చెందిన మహిళ. దానితో మాకు ఎలాంటి సమస్య లేదు. కానీ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో బీఫ్ తింటున్న అనేక ఫోటోలను పంచుకున్నారు. ఆమె సనాతన వాదులకు సవాలు విసురుతున్నారు” అని చెబుతూ.. ముఖ్యమంత్రి తన మొబైల్ ఫోన్‌లో ఆమెకు సంబంధించిన ఫోటోను కూడా చూపించారు. చట్టం ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలుశిక్ష: సీఎం హెచ్చరికఅపై మీడియాతో మాట్లాడుతూ.. అస్సాంలో గోవుల సంరక్షణ చట్టం అత్యంత కఠినంగా ఉందని గుర్తు చేశారు. “నా విన్నపాన్ని మన్నించి ముస్లిం సోదరులు కూడా ఇప్పుడు గోమాంసానికి బదులు బర్రె మాంసాన్ని తింటున్నారు. కానీ కొందరు కావాలనే గోమాంస సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి గోమాంసం తినే వారిని నేను వదిలి పెట్టను. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. వారు నిజంగానే గోమాంసం తిన్నట్లు నిరూపితమైతే మూడేళ్ల జైలు శిక్ష తప్పదు” అని ఆయన హెచ్చరించారు. మరోవైపు ప్రచారం నిర్వహిస్తున్న కుంకి చౌదరికి చుక్కెదురైంది. శుక్రవారం గువహటిలో ఆమె ర్యాలీ నిర్వహిస్తుండగా.. నిరసనకారులు ఏజేపి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఉద్రిక్తతకొందరు కావాలనే గోమాంస సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి గోమాంసం ల మధ్య కుంకి చౌదరి బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీ ఐటీ సెల్ ఏఐ సాంకేతికతను వాడుకుని తప్పుడు వీడియోలను సృష్టిస్తోందని ఆమె మండిపడ్డారు. “బీజేపీ ఇంతగా దిగజారాల్సిన అవసరం ఏముంది? తప్పుడు వీడియోల కోసం కోట్లాది రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నారు? ధైర్యముంటే నా ఇంటికి రండి. నేనే నేరుగా స్టేట్‌మెంట్ ఇస్తాను” అని ఆమె సవాల్ విసిరారు.

Edited,Printed,Published and Owned by Mare Chinnababu , Printed at sravanthi prienters , Rtc Cross Roads ,Hyderabad - 500020. Published at House No : 223 , Gajula Ramaram , Road 1, Hyderabad - 500020, Telangana. Editor : Mare Chinnababu , (TGTEL/33/B45017) e-mail : vaarthapatrika@gmail.com , Cell : 9490617567 , 99081 21111